ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వార్తలు

గురువారం 21 ఆగస్టు 2025 | 5



బొమ్మూరులోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్



రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రులు నిమ్మల, కందుల, ఎమ్మెల్యేలు గోరంట్ల, ఆదిరెడ్డి, ఎమ్మెల్సీ సోము, నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ శేషారావు తదితరులు

యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడమే లక్ష్యం

- మంత్రులు నిమ్మల, కందుల
- రాజమహేంద్రవరంలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

రాజమహేంద్రవరం రూరల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో యువతకు ఉద్యోగం లేదా ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, పర్యాటక సాంస్కృతికశాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీఎంఆర్ కళాశాలలో నిర్మించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ కేంద్రాన్ని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, రూరల్, అర్బన్ ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాస్, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతితో కలిసి మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ స్పోక్ కేంద్రాలు సీఎం చంద్రబాబునాయుడు మానస పుత్రికలని అన్నారు. ఈ హబ్ ద్వారా యువతకు నైపుణ్యాభివృద్ధి, కొత్త ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందిస్తామని, గోదావరి జిల్లాలు వ్యవసాయంతోపాటు పారిశ్రామిక రంగంలో కూడా ముందంజలో నిలుస్తాయన్నారు. రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ రాబోయే తరానికి దిక్సూచి రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ అన్నారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్న చంద్రబాబు సంకల్పం దీంతోనే ప్రారంభమైందన్నారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ తలపెట్టిన ప్రతి ఆవిష్కరణాత్మక కార్యక్రమానికి ప్రధాని మోదీ పూర్తి సహకారముంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, జేసీ చిన్న రాముడు, గ్రీన్ కోర్ చైర్మన్ జి.రాంబాబు, నన్నయ్య వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, పలు విద్యా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వరదల నేపథ్యంలో కంట్రోల్ టీం ఏర్పాటు

- జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు



పడవపై లంకలోకి వెళ్తున్న జిల్లా పశువైద్యాధికారి వెంకట్రావు

పి.గన్నవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వరదల నేపథ్యంలో నదిపరివాహక ప్రాంతాల్లోఉన్న పాడిరైతులను అప్రమత్తం చేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకట్రావు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 14మండలాల్లో 56గ్రామాలకు వరద ప్రభావం ఉంటుందని, ఆయా ప్రాంతాల్లో పశుగ్రాసానికి పాడిరైతులు ఇబ్బందిపడే అవకాశం ఉందని అన్నారు. వరదలు నేపథ్యంలో మండలంలోని పలు వరద ప్రభావిత లంకగ్రామాల్లో పర్యటించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడో ప్రమాద హెచ్చరిక వరకు లంకల్లో పశువులకు ఇబ్బందిలేదన్నారు. వరద ఎక్కువైతే పశువులకు ఇబ్బందులు తలెత్తకుండా 280 మెట్రిక్‌టన్నుల పశుగ్రాసాన్ని సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.లంకల్లో చిక్కుకున్న పశువులను ఇవతలి ఒడ్డుకు తరలించడానికి మరబోట్లు, లైఫ్‌జాకెట్లు అవసరం ఉందని కలెక్టర్‌ను కోరినట్లు వివరించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించేందుకు ఆర్ ఆర్‌టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో పశువైద్యుడితోపాటు కాంపౌండర్, అటెండర్ ఉంటారని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణవైద్యం అందించేందుకుగాను జిల్లా కేంద్రంలో కంట్రోల్ టీంను ఏర్పాటు చేస్తున్నామని, ఇందులో ఏడీ స్థాయిఅధికారి పర్యవేక్షణలో పశువైద్యులు, సిబ్బందిఉంటారని స్పష్టంచేశారు. పాడి రైతులు పుశుగ్రాసం, దాన, వట్టిగడ్డి ముందుగానే నిల్వచేసుకోవాలన్నారు. సహాయ సంచాలకులు విజయరెడ్డి, మండల పశువైద్యాధికారి కిరణ్‌చైతన్యలతో కలిసి లంక ప్రాంతాల్లోపాడిరైతులకు సూచనలిచ్చారు.



ఆలమూరు వద్ద గోదావరి వరదనీటికి మునిగిపోతున్న లంక భూములు



అయినవిల్లి మండలంలో ముక్తేశ్వరం తొగరపాయ వద్ద నీట మునిగిన పాతవంతెన

ఉధృతంగా వరద



పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

- పెరుగుతున్న గోదావరి
- మునుగుతున్న లంక గ్రామాలు
- అన్నంపల్లిలో ఫ్లడ్‌స్టోరేజ్ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్
- పలు రేవుల్లో ప్రయాణాలు బంద్

గోదావరికి వరద పోటెత్తింది. దీంతో జిల్లాలోని గౌతమీ, వశిష్ట, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయలు బుధవారం పొంగి ప్రవహిస్తున్నాయి. సమీపంలోని నదీపరివాహక లంక గ్రామాలన్నీ క్రమంగా జలదిగ్బంధానికి గురవుతున్నాయి.

అమలాపురం,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): ముంబైలో భారీవర్షాల నేపథ్యంలో భద్రాచలానికి వరద పోటెత్తింది. బుధవారంరాత్రికి రెండోప్రమాద హెచ్చరిక స్థాయికి భద్రాచలంవద్ద వరద నీరు చేరుకోవడంతో అక్కడినుంచి 10.78లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. ధవళేశ్వరం వద్ద 8.5లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదలడంతో కోనసీమలోని నదీపాయలన్నీ ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి.

ఉభయగోదావరి జిల్లాల మధ్య ఉన్న పి.గన్నవరం మండలంలోని చాకలిపాలెం కాజ్‌వే పూర్తిగా నీట మునగడంతోపాటు దొడ్డిపట్ల రేవులో ప్రయాణికుల రాకపోకలను నిలిపివేయడంవల్ల సమీప లంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణం చేస్తున్నారు. జి.పెదపూడి వద్ద నాలుగు లంకగ్రామాలకు వెళ్లాల్సిన ప్రజలు లైఫ్ జాకెట్ల సహాయంతో బోట్లపైనే ప్రయాణాలు చేస్తున్నారు. వరద నీటిమట్టం క్రమంగా పెరుగుతున్న దృష్ట్యా అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలోని ఫ్లడ్ స్టోరేజ్ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ వెంట జేసీతోపాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు. వరద పెరుగుతున్న దృష్ట్యా బలహీనంగా ఉన్న ఏటిగట్ల వద్ద రక్షణ చర్యలకు అవసరమైన ఇసుక బస్తాలు, సర్వే కర్రలు వంటి ఇతర మెటీరియల్‌ను సిద్ధం చేసుకుని అప్రమత్తంగా ఉండాలని ప్రత్యేకాధికారులను ఆదేశించారు. వరదలు, వర్షాల ముంపుతో ఏవిపత్తులనైనా ఎదుర్కొనేందుకు అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలని,ఎక్కడా పశు ప్రాణనష్టాలు లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అక్విడెక్టుల పటిష్టతపై తీసుకుంటున్న రక్షణ చర్యలను సమీక్షించారు. ముఖ్యనదీ పరివాహక లంకగ్రామాల్లో ఉన్న పశువులను వరద పెరుగుతున్న దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేలా రైతులను అప్రమత్తం చేశారు. గౌతమీనది పొంగి ప్రవహించడంతో అనేక ప్రాంతాల్లోకి వరద నీరు చేరి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రస్తుతం ఇసుక ర్యాంపు నిలిచిపోవడంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిల్వ కేంద్రాల ద్వారా ఇసుకను తీసుకువెళ్లేందుకు వినియోగదారులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో రెండురోజుల్లో గోదావరి వరద మరింత పెరగనుందని సమాచారం.



అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్



అమలాపురంలో జనజాగృతి రథాన్ని ప్రారంభిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్ విజ్ఞప్తి
- జనజాగృతి రథం ప్రారంభం
- కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ కృష్ణారావు, అదనపు ఎస్పీ ప్రసాద్

అమలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు సైబర్ నేరాలు, మహిళల మీద జరిగే అకృత్యాలపై అప్రమత్తంగా ఉండాలని పెంచుకోవాలని ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. అమలాపురంలోని క్షత్రియ కల్యాణ మండపంలో బుధవారం మహిళల భద్రత, సైబర్, ఇతర నేరాలపై అవగాహన కల్పించేందుకు జనజాగృతి రథాన్ని ఆయన లాంచనంగా ప్రారంభించారు. అనంతరం జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డీఐజీ మాట్లాడుతూ జనజాగృతి రథాన్ని జిల్లా నలుమూలల ముఖ్యమైన కూడళ్లలో జాతరలు, ఉత్సవాలు వంటి సమయాలతోపాటు రద్దీప్రాంతాల్లో మహిళలపై అకృత్యాలు, సైబర్ క్రైమ్, ఇతర నేరాలపై వీడియోలు ప్రదర్శిస్తారని తెలిపారు. దీనిద్వారా ప్రజల్ని చైతన్యవంతుల్ని చేయవచ్చునన్నారు. శక్తి టీములు జిల్లాలో విస్తృతంగా పనిచేస్తున్నాయని, మహిళలు, విద్యార్థినులకు అందుబాటులో ఉంటున్నారని, వారి సేవలను వినియోగించుకోవాలని డీఐజీ విజ్ఞప్తి చేశారు. ఓఎన్జీసీ సహకారంతోపాటు స్నేహిత స్వచ్ఛంద సంస్థ ఇన్‌చార్జి స్వర్ణలత అందించిన సహకారంతో ఈ వాహనాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్ పీబీ ప్రసాద్, డీఎస్పీలు టీఎస్ఆర్కే ప్రసాద్, బి.రఘువీర్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, ఓఎన్జీసీకి చెందిన లెఫ్టినెంట్ కల్నల్ కులదీప్‌సింగ్, స్నేహిత సంస్థ ప్రతినిధి స్వర్ణలత, పోలీసులు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

దీన్‌దయాళ్ స్పర్శ యోజన ఉపకార వేతనాలు

అమలాపురంటౌన్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఫిలాటెలీ, పోస్టల్ స్టాంప్స్‌పై అవగాహన పెంపొందించడంతోపాటు వారిఉన్నత విద్యాభ్యాసానికి తోడ్పాటు అందించే లక్ష్యంతో తపాలాశాఖ ప్రతిఏటా దీన్‌దయాల్ స్పర్శ యోజన స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిస్తున్నట్టు అమలాపురం పోస్టల్ సూపరింటెండెంట్ ఆర్.నవీన్‌కుమార్ తెలిపారు. ఈ పరీక్షల్లో విజేతలైన విద్యార్థులకు ఏడాదికి రూ.6వేల చొప్పున తపాలాశాఖ ఉపకార వేతనాన్ని అందిస్తుంది. 6వతరగతి నుంచి 9వతరగతి చదివే విద్యార్థులు ఈ పరీక్ష రాసేందుకు అర్హులన్నారు. దీన్‌దయాళ్ స్పర్శ యోజన ఉపకార వేతనం పరీక్ష రెండుస్థాయిల్లో జరుగుతుంది. మొదటి లెవెల్‌లో విద్యార్థులకు సర్కిల్‌స్థాయిలో క్విజ్ పరీక్ష నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైనవారు రెండోలెవెల్‌కు అర్హత సాధిస్తారు. అనంతరం తపాలాశాఖ ఎంపికచేసిన సబ్జెక్టుపై విద్యార్థులు ఫిలాటెలీ ప్రాజెక్టులను తయారు చేయాలి. సెప్టెంబరు 16లోగా దరఖాస్తులు అందించాలని, అదేనెల 30న పరీక్ష ఉంటుందని సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు.

ఆ భూములను స్వాధీనం చేసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ, జనసేన నేతలు

- 3వేల ఎకరాల ఇరిగేషన్ పోరంబోకు భూములను స్వాధీనం చేసుకోండి
- కలెక్టరేట్ వద్ద టీడీపీ, జనసేన రైతు నాయకుల ఆందోళన

అమలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో వ్యవసాయ ఆయకట్టు భూములకు సంబంధించి ముంపు నీరు దిగేందుకు శివారు ప్రాంతాల్లో సీఆర్‌జడ్ పరిధిలో ఉన్న ఇరిగేషన్ పోరంబోకు భూములను ప్రభుత్వం తక్షణమే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ రైతులు ఆందోళనకు దిగారు. అమలాపురం పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు మట్టా మహాలక్ష్మీప్రభాకర్ ఆధ్వర్యంలో టీడీపీతోపాటు జనసేనకు చెందిన రైతు సంఘ నాయకులు, ఆక్వారైతులు పెద్దసంఖ్యలో బుధవారం అమలాపురంలోని కలెక్టర్ కార్యాలయం వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వారు వినతిపత్రం అందజేశారు.

4నియోజకవర్గాల ముంపునీరు

ప్రధానంగా కూనవరం, రామేశ్వరం మొగల నుంచి నాలుగు నియోజకవర్గాల పరిధిలోని వేల ఎకరాలకు సంబంధించిన ఆయకట్టు భూముల ముంపునీరు సముద్రంలో కలుస్తోంది. అయినాపురం, వాసాలతిప్ప, అమలాపురం మేజర్ డ్రెయిన్లతోపాటు కుమ్మరికాల్వ, దేశికోడు, అప్పర్‌కౌశిక, లోయర్‌కౌశిక, పంచనది డ్రెయిన్లు అనుసంధానమై ఉన్న అమలాపురం, కొత్తపేట, పి.గన్నవరం, ముమ్మిడివరం నియోజకవర్గాలకు చెందిన ఆయకట్టు భూముల ముంపునీరు అటు కూనవరం మొగ, ఇటు రామేశ్వరం మొగ ద్వారా సముద్రంలో కలుస్తోంది. 1956లో జమిందారీ చట్టం రద్దయిన తర్వాత పాత తేదీలతో జమిందారీ పట్టాలను సృష్టించి 2వేల ఎకరాల భూములను ఆక్రమించి ప్రస్తుతం భారీగా రొయ్యల చెరువులు సాగుచేస్తున్నారు. ఇరిగేషన్ పోరంబోకు స్థలాలుగా పేర్కొన్న ఈ భూములను సర్వే ద్వారా గుర్తించి వాటిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవడంతోపాటు దొంగ పట్టాలతో చెరువుల తవ్వకాలు చేసి పర్రభూములను కబ్జాచేసిన వారిపై ఇరిగేషన్, డ్రైనేజీశాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీఆర్‌జడ్ నిబంధనలకు విరుద్ధంగా వేల ఎకరాల భూములను ప్రభుత్వం సర్వే ద్వారా నిర్ధారించి అధికారికంగా నోటిపై చేసి నాలుగు నియోజకవర్గాల రైతులకు ముంపు నుంచి విముక్తి కలిగించాలని డిమాండ్ చేస్తూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. మొగలు మూసుకుపోయిన దృష్ట్యా వాటిని తవ్వి ముంపునీరు దిగేలా ఏర్పాట్లు చేయాలని కోరుతూ రైతు సంఘాల నాయకులు ఇచ్చిన వినతిపత్రంపై కలెక్టర్ స్పందించి రైతుల డిమాండ్లు పరిశీలించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన రైతు సంఘాల నాయకులు మట్టా మహాలక్ష్మీప్రభాకర్, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, చిక్కం భీముడు, చొల్లంగి సాయిబాబా, లింగోలు పండు, అరిగెల నానాజీ, ఆకుల బుజ్జి, దంగేటి చిట్టిబాబు, దాట్ల గోపీరాజు, రాజులపూడి భీముడు, వేగిరాజు వెంకట్రాజు, బండారు వెంకన్నబాబు, ఆకేటి పెద్ద, కర్రి రామస్వామి, అధికారి బాబ్జి అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జిందాల్‌కు జై



రామేశంమెట్ట చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ప్రతిపాదిత ప్రాంతం

ఉమ్మడి జిల్లాలో రోజువారీ ఉత్పత్తయ్యే చెత్త నుంచి విద్యుత్ తయారుచేసేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఎక్కడికక్కడ కొండల్లా పేరుకుపోతూ ప్రజారోగ్యానికి చేటు చేస్తున్న చెత్త ఇకపై కనిపించకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీన్నంతా ఒకేచోటకు చేర్చి దాని నుంచి విద్యుత్ తయారుచేయడానికి ఎట్టకేలకు టెండర్లు ఖరారు చేసింది. పోటీలో ప్రముఖ జిందాల్ సంస్థ ప్రాజెక్టు దక్కించుకుంది. పెద్దాపురం మండలం రామేశంమెట్టలో 35 ఎకరాల్లో దీన్ని ఏర్పాటుచేయడానికి కంపెనీ తాజాగా ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. రెండు దశల్లో మొత్తం రూ.1270 కోట్ల పెట్టుబడిని జిందాల్ సంస్థ పెట్టబోతోంది. తొలి దశలో రూ.370 కోట్లతో చెత్త నుంచి రోజుకు 12 మెగావాట్ల విద్యుత్ తయారుచేయనుంది. వాస్తవానికి ఈ ప్రాజెక్టును అనపర్తి నియో జకవర్గం బలభద్రపురంలో ఏర్పాటు చేయాలని భావించినా కుదరలేదు. చివరకు రామేశంమెట్ట ఖరారైంది

- జిందాల్ చేతికి రూ.370 కోట్ల చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్
- టెండర్లలో వర్క్ ఆర్డరు దక్కించుకున్న కంపెనీ
- రెండు దశల్లో మొత్తం రూ.1270 కోట్ల పెట్టుబడికి నిర్ణయం
- ఎట్టకేలకు పెద్దాపురం రామేశంమెట్ట అనుకూలంగా ఉండడంతో ఖరారు
- అంతకుముందు కాకినాడ,పిఠాపురంతోపాటు ఏడుచోట్ల స్థలాల పరిశీలన
- ఉమ్మడి తూ.గో. జిల్లాలో చెత్తంతా ఒకేచోటకు తరలించి 12 మెగావాట్ల విద్యుత్ తయారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలు, నగర పంచాయతీలు కలిపి 11 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో రోజూ భారీగా చెత్త పోగవుతోంది. నిత్యం ఈ చెత్తంతా మున్సిపల్ సిబ్బంది నగరాలు, పట్టణాలకు దూరంగా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నారు. ఇందుకోసం వందలకొద్దీ వాహనాలు, ఉద్యోగులు అవసరమవుతున్నారు. ఇలా ఏళ్ల తరబడి పోగవుతున్న చెత్తతో ఆయా ప్రాంతాల డంపింగ్ యార్డులు కొండలను తలపిస్తున్నాయి. వీటికి నిప్పంటిస్తుండడంతో తీవ్ర వాయుకాలుష్యం వెలువడుతోంది. అటు తీవ్రమైన దుర్వాసనతో జనం ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు సైతం తలెత్తుతున్నాయి. ఈనేపథ్యంలో వీటన్నింటికి విరుగుడుగా ఈ చెత్తనంతటిని మండించి విద్యుదుత్పత్తి చేపట్టేలా ప్రాజెక్టుకు రూపకల్పన చేసింది. అందులో భాగంగా చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్రాజెక్టును రూ.370 కోట్లతో పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 11 మున్సిపాల్టీలతోపాటు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని మరో 11 కార్పొరేషన్లు, మున్సిపాల్టీలను కలిపి కాకినాడ-రాజమహేంద్రవరం క్లస్టర్‌గా ప్రభుత్వం ప్రతిపాదించింది. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమతో కలిపి రోజుకు 950 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతున్నట్టు లెక్కలు కట్టింది. ఇందులో అత్యధికంగా ఉమ్మడి తూర్పు పరిధిలోని కాకినాడ కార్పొరేషన్‌లో రోజుకు 144 టన్నులు, రాజమహేంద్రవరం కార్పొరేషన్ 160, పిఠాపురం 26, పెద్దాపురం 25, సామర్లకోట 23, రామచంద్రపురం 23, మండపేట 26, ముమ్మిడివరం 11, అమలాపురం మున్సిపాల్టీ పరిధిలో 30 టన్నుల చొప్పున చెత్త రోజువారీ వస్తోంది. ఈ చెత్తంతటిని ఒకచోటకు చేర్చి దీనితో విద్యుదుత్పత్తి చేయడానికి అధికారులు అంచనా వేయగా, రోజుకు 12మెగావాట్ల వరకు విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చని తేల్చారు. 12మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు రూ.370 కోట్ల వరకు ఖర్చవుతుండగా, ఒక్క పైసా కూడా ప్రభుత్వం పెట్టుబడి పెట్టకుండా ప్రైవేటు కంపెనీయే భరించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే కంపెనీయే ఈ మొత్తం భరించేలా టెండర్లు పిలిచింది. ఎంపికైన సంస్థ ఈ మొత్తం భరిస్తే ప్రభుత్వం తరఫున చెత్త ఇవ్వడం, ఉత్పత్తయిన విద్యుత్‌ను 25ఏళ్లపాటు సదరు కంపెనీయే సొంతంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ఒకరకంగా చెప్పాలంటే ప్రభుత్వానికి ఏమాత్రం భారం లేకుండా రెండు కార్పొరేషన్లు, తొమ్మిది మున్సిపాల్టీల్లో చెత్తంతా బయటకు వెళ్లిపోనుంది. అయితే తాజాగా ఈ ప్రాజెక్టుకు పిలిచిన టెండర్లలో పలు కంపెనీలు పోటీపడగా, ప్రముఖ జిందాల్ కంపెనీ వర్కు ఆర్డరు సొంతం చేసుకుంది. దీంతో ప్రభుత్వం ఈ సంస్థతో ఇటీవల ఒప్పందం ఖరారు చేసుకుంది. ప్రాజెక్టుకు కేంద్రం నుంచి పర్యావరణ అనుమతులు కావలసి ఉండడంతో దరఖాస్తు చేసుకుంది. ఇప్పటికే జిందాల్ గుంటూరులో చెత్త నుంచి విద్యుత్ తయారుచేస్తోంది.

అన్నీ చూసి.. రామేశంమెట్ట ఓకే చేసి..

ఈ ప్రాజెక్టుకు అనువైన ప్రదేశం కోసం పలు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు తొలుత అనపర్తి నియోజకవర్గం బిక్కవోలులో 12, బలభద్రపురంలో 20ఎకరాలు ఎంపిక చేశారు. 12 ఎకరాల్లో విద్యుత్‌ప్లాంట్, 20ఎకరాల్లో తెచ్చిన చెత్త, ఫ్లైయాష్ పోగుచేసేలా ప్రతిపాదించారు. తద్వారా చెత్త నుంచి తయారయ్యే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానించేలా విద్యుత్ లైన్ ఉండడంతో ప్రాజెక్టు ఖరారు చేశారు. తీరా దీనిపై స్థానిక ప్రజలు, అటు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నుంచి అభ్యంతరం వ్యక్తమైంది. దీంతో ప్రత్యామ్నాయంగా కాకినాడ జిల్లాలో కాకినాడ సిటీ, పిఠాపురం చెందుర్తితోపాటు మరో ఏడుచోట్ల అధికారులు పరిశీలించారు. పెద్దాపురం రామేశంమెట్ట అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. ఈ ప్రాంతం జనావాసాలకు దూరంగా ఉండడం, పైగా ఈ ప్రాంతం ఏడీబీ రహదారిని అనుకుని ఉండడంతో చెత్త వాహనాల రాకపోకలకు అనువుగా ఉంటుందని నిర్ణయానికి వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే రాజప్ప సైతం ఈ ప్రాంతంలో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు సుముఖంగా ఉండడంతో ఎట్టకేలకు రామేశంమెట్టను ఖరారు చేశారు. జిందాల్ సంస్థ సైతం ఇక్కడ ప్రాజెక్టుకు అనుకూలత ఉండడంతో 35 ఎకరాలు కోరింది. దీంతో కొన్ని రోజుల కింద ఆ కంపెనీకి 16 ఎకరాల ప్రభుత్వ భూములు అప్పగించారు. మరో 19 ఎకరాలు చెత్తనిల్వ, ఫ్లైయాష్ నిల్వకు అవసరం ఉండడంతో సమీపంలో ఉన్న డీపట్టా భూములు గుర్తించారు. రైతులకు ఎకరాకు రూ.19 లక్షల వరకు ఇచ్చేలా చర్చలు జరుపుతున్నారు. తొలివిడత ప్రాజెక్టు పూర్తయ్యాక మలివిడత ఈ ప్రాజెక్టుపై జిందాల్ మరో రూ.900 కోట్ల పెట్టుబడి పెట్టనుంది.



పసుపు కొమ్ములతో ఆరు అడుగులు

గణపతిని తయారు చేసిన గొల్లప్రోలు తాపీమేస్త్రీ కోలా వీరబాబు

గొల్లప్రోలు, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): పర్యావరణానికి హాని కలిగించని విగ్రహాలు తయారు చేయాలనే అతడి సంకల్పం ఏటా వినూత్నంగా గణనాథుని విగ్రహాల తయారీపై దృష్టి పెట్టేలా చేసింది. ఆరేళ్లుగా భిన్నమైన విగ్రహాలను తయారు చేసి నిలుపుతున్నారు.


వీరబాబు

కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణానికి చెందిన తాపీ మేస్త్రీ కోలా వీరబాబు ఆరు అడుగుల ఎత్తున గల పసుపు కొమ్ముల వినాయక విగ్రహాన్ని తయారు చేశారు. దాదాపుగా నెల నుంచీ ఇదే పనిలో నిమగ్నమై ఉన్న ఇతను ప్రస్తుతం గణనాథుడికి తుది మెరుగులు దిద్దుతున్నాడు. ఆరు కిలోల తేనె మైనం, మట్టి, గడ్డి, తొమ్మిది కిలోల పసుపు కొమ్ములు వినియోగించి దీనిని తయారు చేశాడు. దీనిని తాటిపర్తి పుంత రోడ్డులో వినాయక చవితి సందర్భంగా నిలపనున్నట్టు వీరబాబు చెప్పాడు. గత ఆరేళ్లలో మట్టి వినాయకుడితో పాటు పసుపు, పిండి, కాజీ పాకం, రుద్రాక్షలతో వినాయక విగ్రహాలను తయారు చేశారు. పర్యావరణానికి హాని కలిగించని రీతిలో వినాయకుడిని తయారు చేయాలనే సంకల్పమే తనను ఇటువైపు నడిపించిందని వీరబాబు తెలిపాడు. అతడు తయారు చేస్తున్న ఈ పర్యావరణహిత విగ్రహాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి.

> వినాయక చవితికి గణనాథుని విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వివిధ రకాల ఆకృతిలో వీటిని తయారు చేయడంలో రాజస్థాన్‌కు చెందిన కళాకారులు నిమగ్నమయ్యారు. అక్కడి నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు విగ్రహాల తయారీ ద్వారానే కుటుంబాలను పోషించుకుంటున్నారు. రెండు అడుగులు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు గల విగ్రహాలను వీరు తయారు చేస్తున్నారు. చవితికి ఆరు నెలల ముందు నుంచే వీరు విగ్రహాల తయారీకి శ్రీకారం చుట్టి ఉత్సవాల సమయానికి ప్రజలు కోరిన విధంగా సిద్ధం చేస్తారు.

ఓ బొజ్జ గణపయ్య... మీ బంటు మేమయ్య




కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణ శివారులో రాజస్థాన్ కార్మికులు తయారు చేసిన వినాయక విగ్రహాలు

- వినాయక విగ్రహాల తయారీలో రాజస్థాన్ కార్మికులు
- ఆరు నెలలు ముందు నుంచే ఇదే పనిలో...
- కుటుంబాలతో ఇక్కడే స్థిరపడ్డ రాజస్థానీయులు
- విగ్రహం రూపు ఒక రోజులోనే
- ఫినిషింగ్ టచ్‌లకు రెండు నుంచి మూడు నెలలు
- రెండు నుంచి 15 అడుగుల వరకు విగ్రహాల తయారీ

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

హిందూ సంప్రదాయంలో వినాయక చవితికి ఉన్న ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ప్రతి ఒక్కరూ గణనాథునికి పూజలు నిర్వహించి తాము చేపట్టే కార్యక్రమాలకు విఘ్నాలు రాకుండా చూడాలని ప్రార్థిస్తారు. అదే సమయంలో గ్రామాలు, పట్టణాలు, నగరాలు బేధం లేకుండా వీధివీధినా వినాయక విగ్రహాలు నిలిపి నవరాత్రి మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పెద్ద వినాయక విగ్రహాల ఏర్పాటుపై ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీల మధ్య పోటీ నెలకొంటుంది. ప్రతిఏటా విగ్రహాల ఎత్తు, సైజు పెంచుకుంటూ వెళ్తారు. కొన్ని ప్రాంతాల్లో ఆకర్షణీయంగా ఉండే వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తారు. ఇలా భారీ విగ్రహాలను తయారు చేసేది మాత్రం రాజస్థాన్ కార్మికులే. వీరి కుటుంబాలు ఇక్కడకు వలస వచ్చి స్థిరపడి విగ్రహాల తయారీలోనే కొనసాగుతున్నారు. ఆరు నెలల పాటు గణనాథుని విగ్రహాలు, మిగిలిన ఆరు నెలలు తీర్థాల్లో రకరకాల చిన్నచిన్న బొమ్మలు విక్రయించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రాజస్థాన్ నుంచి కడియ మట్టి తీసుకువచ్చి

వినాయక విగ్రహాల్లో వినియోగించే కడియ మట్టి, వైట్ మట్టి (ప్లాస్టర్ ఆఫ్ పారిస్)ని రాజస్థాన్ నుంచి, కొబ్బరి పీచుని యానాం, కోనసీమ జిల్లా నుంచి తీసుకువస్తారు. సాధారణ మట్టిని స్థానికంగా కొనుగోలు చేస్తారు. ఒక టన్ను కడియ లేదా వైట్ మట్టి రూ.3వేలు నుంచి 4వేలు వరకు ఉంటుంది. విగ్రహం రూపును వీరు కేవలం ఒక రోజులోనే తయారు చేస్తారు. తుది మెరుగులు దిద్ది రంగులు వేయడానికి, విగ్రహంపై కొనుగోలుదారులు కోరిన విధంగా మార్పులు చేయడానికి రెండు నుంచి మూడు నెలల సమయం పడుతుందని చెప్తున్నారు. రెండు అడుగులు నుంచి 15 అడుగుల ఎత్తు వరకు గల విగ్రహాలను వీరు తయారు చేస్తారు. సాధారణ మట్టితో విగ్రహాలు తయారు చేస్తున్నా వీటికి ఆర్డర్లు తక్కువగా ఉండడంతో చవితికి దగ్గర చేసి వీటిని తయారు చేస్తారు.

ఆరు నెలల ముందు నుంచే

వినాయక చవితికి అవసరమైన విగ్రహాల తయారీని ఆరు నెలలు ముందుగానే ప్రారంభిస్తారు. ఇందుకు అవసరమైన ముడి సరుకులను ఆర్డర్ ఇచ్చి తెప్పించుకుంటారు. ముందు ఏడాది విక్రయాలు సాగిన తీరుని బేరీజు వేసుకుని ఏయే రకాల విగ్రహాలు తయారు చేయాలో నిర్ణయించుకుంటారు. వినాయక చవితికి వారం మాత్రమే ఉండడంతో ఇప్పటికి తయారు చేసిన విగ్రహాలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. పినిషింగ్ టచ్‌లకే అధిక సమయం పడుతోందని కార్మికులు తెలిపారు. ముందుగా ఆర్డర్లు ఇచ్చిన వారికి తయారు చేసి ఇస్తామని, మిగిలిన విగ్రహాలను వచ్చిన వారికి వచ్చినట్లు విక్రయిస్తామన్నారు. విగ్రహాలకు తుది మెరుగులు దిద్ది వారం, పది రోజుల ముందు రంగులు వేస్తామని తెలిపారు. ఆరు నెలల్లో వందకి పైగా విగ్రహాలు తయారు చేస్తామని, డిమాండ్ ఉంటే ఇంకా అధికంగా సిద్ధం చేస్తామని చెప్పారు.

దశాబ్దానికి పైగా ఇదే వృత్తిలో

రాజస్థాన్ నుంచి సుమారు 200కి పైగా కుటుంబాలు విగ్రహాల తయారీలో నైపుణ్యాన్ని సంపాదించాయి. వీరు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడి అక్కడ విగ్రహాలు తయారు చేస్తున్నారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పెద్దాపురం, తుని, కాకినాడ, యానాం-తాళ్లరేవు ప్రాంతాల్లోను, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాల్లో వీరు ఖాళీ స్థలాలు అద్దెకు తీసుకుని కుటుంబాలతో సహా అక్కడే ఉంటున్నాయి. పిల్లలను ఇక్కడే చదివిస్తున్నారు. పిఠాపురం పట్టణ శివారులోని 216 జాతీయ రహదారి చెంతనే రెండు కుటుంబాలు నివాసముంటూ విగ్రహాలు తయారు చేస్తున్నారు. ఎనిమిది మంది ఇదే వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. వీరు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి 12 సంవత్సరాలు కాగా, పిఠాపురం వచ్చి నాలుగు సంవత్సరాలు దాటింది.

విగ్రహాలు లేదంటే బొమ్మలు

చవితికి గణనాథుని విగ్రహాలు తయారు చేసిన తర్వాత వీరు మిగిలిన ఆరు నెలలు బొమ్మలు, చిన్నచిన్న దేవుని విగ్రహాలను తయారు చేస్తారు. వీటిని వివిధ ప్రాంతాల్లో జరిగే తీర్థాలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు. కొందరు ప్రత్యేకంగా వారికి కావాల్సిన రీతిలో విగ్రహాలకు ఆర్డర్లు ఇస్తే వాటిని తయారు చేస్తారు. విగ్రహాలు, బొమ్మల తయారీ, విక్రయాల ద్వారా కుటుంబానికి గతంలో నెలకు రూ.50వేలు వచ్చేదని, ఇప్పుడు ముడిసరుకుల ధర పెరగడంతో అది సగానికి పడిపోయిందని కార్మికులు తెలిపారు. ఈ ఏడాదైనా ఆ విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో విగ్రహాల అమ్మకం బాగా జరగాలని ఆశిస్తున్నట్టు వారు చెప్పారు.





విగ్రహాల తయారీయే ఆధారం

అమరారామ్, పాలి జిల్లా, రాజస్థాన్

వినాయక విగ్రహాల తయారు చేసి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయమే మా కుటుంబాలకు ఆధారం. ఏటా ఆరు నెలలు ఇదే పనిలో ఉంటాం. మిగిలిన సమయంలో బొమ్మలు తయారు చేసి విక్రయిస్తుంటాం. మా కుటుంబాలు ఇక్కడే స్థిరపడ్డాయి. పిల్లల చదువులు ఇక్కడే సాగుతున్నాయి. ఎప్పుడైనా ఫంక్షన్లు జరిగినప్పుడు మాత్రమే రాజస్థాన్ వెళ్తాము.



పూజల్లో మా గణనాథులు ఉండడం ఆనందదాయకం

బికారామ్, పాలి జిల్లా, రాజస్థాన్

మా చేతిలో రూపుదిద్దుకున్న గణనాథులు వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసే మందిరాల్లో పూజలు అందుకోవడం ఆనందదాయకం, పూర్వజన్మసుకృతం. మా కుటుంబ సభ్యులందరూ ఇదే పనిలో నిమగ్నమై ఉంటాం. తయాలో సంప్రదాయానికి పెద్ద పీట వేస్తాం. ఏటేటా భారీ విగ్రహాలకు డిమాండ్ పెరుగుతోంది. ముడిసరుకుల ధరల పెరిగిన రీతిలో విగ్రహాల ధరలు పెరగకపోవడంతో మాకు వచ్చే ఆదాయం తగ్గుతోంది.


ధవళేశ్వరం వద్ద దిగువకు వదులుతున్న వరద నీరు


శబరి బ్రిడ్జిని ఆనుకుని ప్రవహిస్తున్న వరద ప్రవా

ఉధృతంగా గోదావరి

- ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న నీటిమట్టం
- భద్రాచలం వద్ద మొదటి హెచ్చరిక జారీ

ధవళేశ్వరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రవాహం నుంచి వస్తున్న వరద నీటితో ధవళేశ్వరంవద్ద గోదావరి నీటిమట్టం వేగంగా పెరుగుతోంది. మంగళవారం సాయంత్రం వరకు తగ్గిన నీటిమట్టం 10అడుగులకు చేరుకుని 16 గంటల పాటు నిలకడగా కొనసాగింది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ నుంచి 7.50లక్షల క్యూ సెక్కులు సముద్రంలోకి ప్రవహించింది. ఆపై బుధవారం ఉదయం 10గంటల నుంచి స్వల్ప పెరుగుదల నమోదైంది. సాయంత్రానికి 10.30 అడుగులకు చేరుకుంది. ఆపై నీటిమట్టం వేగంగా పెరుగుతూ రాత్రి 9గంటలకు 10.70 అడుగులకు చేరుకోగా 8,40,754 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలేశారు. అర్ధరాత్రి దాటిన తరువాత మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి 11.75 అడుగులకు నీటిమట్టం చేరుకోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

అంతటా అప్రమత్తత

గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ఫ్లడ్ కన్జర్వేటర్, హెచ్‌వర్క్స్ ఈఈ శ్రీనివాసరావు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఫ్లడ్ సెక్షన్ అధికారులు, ఫ్లడ్ సూపరింటెండెంట్ విధుల్లో చేరివారికి కేటాయించిన రూట్లలో విధులు నిర్వహిస్తున్నారు. ఫ్లడ్ స్టోర్‌లో ఫ్లడ్ మెటీరియల్‌ను సిద్ధం చేశారు. ఔట్‌ఫాల్ స్లూయిస్‌ల వద్ద వరద నీరు ప్రవేశించకుండా తగుచర్యలు చేపడుతున్నారు.

●ఎగువన భద్రాచలం వద్ద బుధవారం ఉదయం 9గంటలకు నీటిమట్టం 43 అడుగులు దాటడంతో మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఆపై క్రమంగా పెరుగుతున్న నీటిమట్టం రాత్రి 9గంటల సమయానికి 47.70 అడుగులకు చేరుకుని రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతోంది.

ప్రమాద హెచ్చరికలు ఇవే

ధవళేశ్వరంవద్ద కాటన్ బ్యారేజ్ ద్వారా 10 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తూ ఉండగా నీటిమట్టం 11.75 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. నీటి మట్టం 13.75అడుగులకు చేరి 13లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తూ రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. నీటి మట్టం 17.75అడుగులకు చేరి 18లక్షల క్యూసెక్కులు పైబడి వరద నీరు ప్రవహిస్తూ ఉంటే మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేస్తూ ఉంటారు. నీటిమట్టం రెండో ప్రమాద హెచ్చరిక దాటిన తరువాత సర్కిల్ ఎస్‌ఈ ఫ్లడ్ కన్జర్వేటర్‌గా వ్యవహరిస్తారు.

● భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 43 అడుగులకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 48 అడుగులు దాటితే రెండో ప్రమాద హెచ్చరిక, 53 అడుగుల వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

ఎగువ నీటిమట్టాలు ఇదే

ఎగువ ప్రాంతాల్లో నీటిమట్టం పెరుగుదల వేగం నెమ్మదించింది. బుధవారం సాయంత్రానికి కాళేశ్వరంవద్ద నీటిమట్టం 12.82మీటర్లుగా నమోదుకాగా, పేరూరువద్ద 17.44మీటర్లు, దుమ్ముగూడెంవద్ద 12.80 మీటర్లు, భద్రాచలంవద్ద 46.60 అడుగులు, కూనవరంవద్ద 18.40 మీటర్లు,కుంటవద్ద 9.70మీటర్లు, పోలవరంవద్ద 11.78 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జివద్ద 15.55మీటర్లుగా నీటిమట్టాలు నమోదయ్యాయి.

పెరుగుతున్న శబరి గోదావరి

● ముంపు మండలాల్లో అల్లూరి జిల్లా ఎస్పీ పర్యటన



చింతూరు: సోకిలేరు వాగు దాటి సంతకు వెళుతున్న గిరిజనులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ని పరిశీలిస్తున్న అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

చింతూరు: గోదావరి, శబరినదుల ఉధృతి మళ్లీ పెరుగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి రాత్రి ఎనిమిది గంటలకు 47 అడుగులు దాటి ప్రవహిస్తోంది. అదే దశలో చింతూరువద్ద శబరి నది 33అడుగుల మేర ప్రవహిస్తోంది. బుధవారం ఉదయం నుంచి గోదావరిఉధృతి పెరుగుతుండడంతో ఆ నీరంతా కూనవరం వద్ద శబరికి ఎగపోటునిస్తోంది. దీంతో బుధవారం ఉదయం వరకు తగ్గిన శబరి నది ఉధృతి సాయంత్రం నుంచి తిరిగి పెరగడం మొదలైంది. దీంతో ఒడిస్సాకు వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే దశలో చీకటి వాగు, సోకిలేరు వాగు పొంగడంతో చింతూరు-వరరామచంద్రపురం మండలాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. చింతూరు-కూనవరం నడుమ కోండ్రాజుపేట వద్ద ప్రధాన రహదారిపై వరద నీరు చేరడంతో ఈ రెండు మండలాల నడుమ కూడా రాకపోకలు నిలిచిపోయాయి. మొత్తంమీద మూడోరోజు కూడా చింతూరు మండలంలో 16 గ్రామాలు జలదిగ్బంధనంలోనే మగ్గుతున్నాయి. దీంతో ఆయా గ్రామాలకు చెందిన బాధితులు బుధవారం వారాంతపు సంతకు నాటు పడవల మీదుగా వాగులు దాటి వచ్చి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకున్నారు.

సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లండి

● అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్

చింతూరు: డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం మండలాల్లో ముంపు ప్రాంతాలలో అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన లోతట్టు వాసులకు అధికారులకు పలు సూచనలిచ్చారు. ప్రధానంగా వరద ప్రభావం ఉన్న ప్రతి గ్రామం నుంచి బాధితులు సురక్షిత ప్రాంతాలకు సకాలంలో తరలి వెళ్లాలన్నారు. ఈ మేరకు అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. చింతూరు ఐటీడీఏలో ఏర్పాటుచేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ పనితీరుని ఆయన పరిశీలించారు. ఎస్పీ వెంట రంపచోడవరం సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఓఎస్డీ జగదీష్ హడహళి, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎటపాక సీఐ కన్నపరాజు అధికారులు వున్నారు.

జల దిగ్బంధంలో 30 గ్రామాలు

వీఆర్‌పురం: వారం రోజులుగా ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న భారీవర్షాలకు గోదావరి, శబరినదులు ఉగ్రరూపం దాల్చాయి. దీంతో వరదనీరు గ్రామాల్లోని ప్రధాన రహదారుల పైకి గోదావరి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. ఈ వరదనీరు కారణంగా 30 గ్రామాలు పైగానే జలదిగ్బంధంలో ఉన్నాయి.


భూవిజ్ఞాన శాస్త్రాల్లో పట్టు సాధించాలి

● జియోసైన్సస్ విభాగాధిపతి ఆచార్య శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు20 (ఆంధ్రజ్యోతి): జియోసైన్సస్ విద్య, పరిశోధనలలో విద్యార్థులు పట్టు సాధించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సస్ విభాగాధిపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మహనీయులను ఆదర్శంగా తీసుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలని చెప్పారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జియోసైన్సస్ విభాగం ఆధ్వర్యంలో డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు అండ్ మహదేవన్ మెమోరియల్ అవార్డులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంను బుధవారం నిర్వహించారు. దీనికి శ్రీనివాసరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ మైక్రోపాలియంటాలజీ అప్లికేషన్ నైపుణ్యంపై స్మారకోపన్యాసం నిర్వహిస్తున్నామన్నారు. జియోసైన్సస్‌లో ప్రతిభకనబరచిన విద్యార్థులకు మెమోరియల్ అవార్డులను అందజేస్తామన్నారు. పీఎం ఉషా పథకంలో భాగంగా దీనిని నిర్వహిస్తున్నామని చెప్పారు. చెన్నై ఎఎన్జీసీ పూర్వచీఫ్ జియాలజిస్ట్ ఎ.నల్లపరెడ్డి మాట్లాడుతూ శాస్త్రరంగంలో డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు అందించిన సేవలను ప్రశంసించారు. డాక్టర్ డి.ఎస్.ఎన్.రాజు స్మారక అవార్డులు అందుకుంటున్న విద్యార్థులు ఆయనను అనుసరిస్తూ సమాజానికి ఆదర్శవంతంగా నిలవాలన్నారు. యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ ఆచార్య ఎస్.ఎస్.హాన్సేన్ మాట్లాడుతూ ఆచార్య మహదేవన్ చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. ఆ తరువాత డాక్టర్ డిఎస్ఎన్ రాజు మెమోరియల్ అవార్డులు మొదటి సంవత్సరంలో సబ్జెక్టులో మొదటిస్థానం పొందిన 2022 బ్యాచ్ విద్యార్థి యార్లగడ్డ నాగసాయి, ద్వితీయస్థానం పొందిన మానేపల్లి బ్లెస్సీ, 2023లో మొదటి రెండు స్థానాలు పొందిన ఆముదల విజయకుమార్, నందివాడ తేజస్వినికి అందజేశారు. మహదేవన్ అవార్డును 2022 బ్యాచ్ యార్లగడ్డ నాగసాయి, 2023 బ్యాచ్ కీర్తి షాతనకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.విజయనిర్మల, పి.ఎం.ఉషా కోఆర్డినేటర్ కె.రమణేశ్వరి, అధ్యాపకులు కె.వి.స్వామి, కె.నూకరత్నం, డి.వి.తేజ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో తక్షణం బీసీ కులగణన చేపట్టాలి

● బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు డిమాండ్


ఐక్యత చాటుతున్న బీసీ సంఘ నాయకులు

కాకినాడ సిటీ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తక్షణం బీసీ కులగణన చేపట్టాలని బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శొంటి నాగరాజు డిమాండ్ చేశారు. బుధవారం కాకినాడ కొండయ్యపాలెంలో బీసీ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యనమదల రవి అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ అట్టడుగున ఉన్న బీసీలు రాజ్యాధికారం సాధించడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో బీసీ కుల గణన చేపట్టకపోవడంతో రాజకీయంగా అవకాశాలు కోల్పోతున్నా రన్నారు. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా 139 ఉప కులాలు గల బీసీలు అన్నిరంగాల్లో వెనుకబడి ఉన్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో బీసీలను అత్యధికంగా చట్టసభలకు పంపించడమే లక్ష్యంగా అందరూ పని చేయాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు యనమదల రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో జిల్లాలో బీసీలకు చాలా అన్యాయం జరుగుతోందన్నారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యేగా మూడుసార్లు నెగ్గిన వనమాడి కొండబాబు క్యాబినెట్ హోదాలో మంత్రి పదవి ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంత లక్ష్మీకి రాష్ట్రస్థాయి చైర్‌పర్సన్ పదవి కల్పించాలన్నారు. రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు రవికి ఉత్తరాంధ్ర ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్టు రాష్ట్ర అధ్యక్షుడు నాగరాజు ప్రకటించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాసంశెట్టి త్రిమూర్తులు, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అనుసూరి సతీష్, నాయకులు కొండా వినాయక్, కొప్పిశెట్టి చంద్రమౌళి, చొక్కా జగన్, కాదా శివరామకృష్ణ, రాయుడు దుర్గ, పెంకే వెంకటలక్ష్మి, మట్టపర్తి మోన, రచ్చ ధనలక్ష్మి పాల్గొన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్(కాకినాడ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ, కోనసీమజిల్లాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికి 3వ విడత ప్రవేశం కోసం ఈనెల 26లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కాకినాడ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్, కాకినాడ, కోనసీమజిల్లాల కన్వీనర్ ఎం.వేణుగోపాలవర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థి ఏ ఐటీఐలో చేరాలో దానిని తప్పనిసరిగా ఆన్‌లైన్ అప్లికేషన్‌లోనే ఎంపిక చేసుకోవాలన్నారు. మొదటి, రెండవ విడతల్లో సీట్లు రాని వారు తప్పనిసరిగా మూడో విడత ప్రవేశానికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ అయిన అభ్యర్థులందరూ ప్రభుత్వ/ప్రైవేటు ఐటీఐల్లో ఈనెల 27వ తేదీలోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్, అప్రూవల్ చే యించుకోవాలన్నారు. అలా చేయని వారు కౌన్సెలింగ్‌కు అర్హులు కాదన్నారు. దరఖాస్తు చేసుకునేటప్పుడు ఏవైనా సందేహాలు ఉంటే 0884-2348182/ 9440408182లో సంప్రదించాలని కోరారు.


శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయ స్వామి, నృసింహ సరస్వతి

నేటి నుంచి శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు

● వారం రోజులు ప్రత్యేక పూజలు

పిఠాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థానంగా విరాజిల్లుతున్న కాకినాడజిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో గురువారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు శ్రీపాదశ్రీవల్లభ జయంతి సప్తాహ మహోత్సవాలు జరుగనున్నాయి. వారంరోజులు ప్రత్యేక పూజలు, కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈఉత్సవాల్లో పాల్గొనేందుకు మహారాష్ట్ర, గోవా, ఉత్తరాదితో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు. వీరికోసం ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. మహా సంస్థానంలో సద్గురు సజ్జనగడ రామస్వామి దివ్య ఆశీస్సులతో వేదోక్త విధి అనుసరించి సప్తాహదీక్షతో శ్రీపాద జయంతి ఉత్సవాలు గురువారం ప్రారంభమయవుతాయి. ఉదయం శ్రీపాదశ్రీవల్లభుల వారికి గ్రామోత్సవం నిర్వహిస్తారు. 21 నుంచి 27 వరకు ప్రతిరోజూ ఉదయం మహాగణపతి పూజ, కలశస్థాపన, శ్రీపాద శ్రీవల్లభుల వారి మహిమాన్విత దివ్యపాద పద్మాలకు మహన్యాసపూర్వక శత రుద్రాభిషేకం, శ్రీసూక్త, పురుష సూక్తాలతో సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, తీర్థ ప్రసాద వినియోగం, రుత్విక్కులచే దత్త మూలమంత్ర అనుష్టానము, గణపతి అథర్వ ఉపనిషత్ పారాయణ, శ్రీగురుచరిత్ర పారాయణ, శ్రీపాద శ్రీవల్లభ చరిత్ర పారాయణ జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు అగ్ని ప్రతిష్ఠాపన, దత్త మంత్ర హోమం, సాయంత్రం 5గంటలకు శ్రీపాద శ్రీవల్లభుల వారి దివ్య పాద పద్మాలకు వివిధ హారతులు, స్వామివారికి పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి నిర్వహిస్తారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. 21న శ్రీపాదశ్రీవల్లభులకు సర్వపుష్ప పూజ, 22న సహస్ర చామంతి పూజ, 23న లక్ష తులసిఅర్చన, 24న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 25న లక్ష బిల్వార్చన, 26న సహస్ర గులాబీ అర్చన, 27న శ్రీపాద జయంతి రోజున పూలంగి సేవ, మారేడుపత్రి పూజ, పూర్ణాహుతి జరుగుతాయి. సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. జయంత్యుత్సవాలకు వచ్చే భక్తుల కోసం డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనలకు అనుగుణంగా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.సౌజన్య తెలిపారు.

ఉద్యోగ, ఉపాధికి కేంద్రంగా ఏపీ

- తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఆవిష్కాంధ్ర సాధనలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి
- రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభ సభలో మంత్రి నిమ్మల


హబ్ ప్రారంభ సభలో ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి నిమ్మల, కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధికి కేంద్రంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు తీర్చిదిద్దుతున్నారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. బుధవారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో ఆవిష్కాంధ్ర సాధన సభ జరిగింది. దీనికి మంత్రి నిమ్మలతోపాటు కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముప్పిడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు, నన్నయ్య యూనివర్శిటీ వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్‌రావు, ఓఎన్‌జీసీ ప్రతినిధి కేవీకే రాజు, గ్రీన్ కోర్ చైర్మన్ ఐరాంబాబు హాజరయ్యారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి సభను ప్రారంభించారు. తొలుత మంగళగిరిలోని మయూరి టెక్ పార్క్ ప్రాంగణం నుంచి సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని డిజిటల్ స్క్రీన్‌పై తిలకించారు. చంద్రబాబు ఇంట్రపెన్యూర్‌పై ఆయన విజనరీని ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. అనంతరం కళాకేంద్రంలో జరిగిన సభలో మంత్రి రామానాయుడు మాట్లాడారు. ఆవిష్కాంధ్ర సాధనలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఓ మైలురాయి అని అన్నారు. విజన్ 2020 అంటే ఆనాడు సాధ్యమా అని అనుకున్నారని, కాని ప్రతీ ఇంటికి ఒక సాఫ్ట్ వేర్ ఇంజనీర్‌ను తయారు చేయడంలో చంద్రబాబు లక్ష్య సాధకులయ్యారన్నారు. ఇప్పుడు అమరావతి కేంద్రంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నారన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే వ్యవసాయ, పరిశ్రమలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాఅండ్ ఆర్డర్ బాగుండాలని, వాటిని సరిచేసి రాష్ట్రాన్ని ఇన్నోవేషన్ హబ్‌గా మార్చాలన్నదే చంద్రబాబు సంకల్పమన్నారు. అందులో భాగంగా ఆవిష్కాంధ్ర దిశగా తొలి అడుగు పడడం ఎంతో సంతోషదాయకమన్నారు. యువతలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ ఉపయోగపడుతుందని మంత్రి తెలిపారు.

ప్రతి కుటుంబం నుంచి పారిశ్రామికవేత్త...

ఈ హబ్ ద్వారా భవిష్యత్తులో ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త పుట్టుకొస్తారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. గోదావరి జిల్లాలు వ్యవసాయ ఆధారిత జిల్లాలని, ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా రానున్నరోజుల్లో పారిశ్రామిక రంగంలోనూ ఈ జిల్లాలు ముందు వరుసలో నిలబడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఐదేళ్ల జాబ్ క్యాలెండర్ లేక, డీఎస్సీ నోటిఫికేషన్లు రాక యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని, ఆనాడు యువతను డ్రగ్స్‌కు బానిసలుగా మార్చి రాష్ట్రాన్ని గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని, కూటమి ప్రభుత్వం వచ్చాక వాటన్నింటినీ సరిచేసి రాష్ట్రాన్ని ఉద్యోగ, ఉపాధి రంగాలకు కేంద్రంగా మార్చుతున్నారని చెప్పారు.


జ్యోతి ప్రజల్వన చేస్తున్న మంత్రి నిమ్మల


హాజరైన పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు

రాష్ట్రం మరింత ముందుకు...

రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ చంద్రబాబు విజన్‌లో భాగంగా ప్రవేశపెట్టిన ఈ ఇన్నోవేషన్ హబ్ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా మరింత ముందుకు తీసుకు వెళ్తుందని చెప్పారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తును గొప్పగా మలిచేందుకు ఈ ఇన్నోవేషన్ హబ్ ద్వారా సీఎం చంద్రబాబు నాంది పలికారన్నారు. ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చంద్రబాబు కృషి ఫలితంగానే ఈరోజు దేశవిదేశాలలో మనవాళ్లు మంచి స్థాయిలో ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. తొలుత నన్నయ్య యూనివర్సిటీ వీసీ వి.ప్రసన్న, గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు, ఆదిత్య యూనివర్సిటీ చైర్మన్ శేషారెడ్డి, గెయిల్ ప్రతినిధి కేవీఆర్ రావు, ఓఎన్‌జీసీ ప్రతినిధి కేవీకే రాజు, గ్రీన్ కోర్ చైర్మన్ ఐ.రాంబాబు మాట్లాడారు. చంద్రబాబు ఆలోచనలో అందరు భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, దీనికి తమ వంతు బాధ్యతగా కృషి చేస్తామని వక్తలు అన్నారు. అనంతరం అందరితో కలెక్టర్ ప్రశాంతి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కళాకేంద్ర ప్రాంగణంలో ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను తిలకించారు. సభలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు, జిల్లా రెవెన్యూ అధికారి టీ.సీతారామమ్మూర్తి, రాజమహేంద్రవరం ఆర్డీవో ఆర్.కృష్ణనాయక్, తాడేపల్లిగూడెం ఎన్ఐటీ ప్రతినిధి రవికిరణ్ శాస్త్రి, వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ ప్రతినిధి డీన్ డాక్టర్ ఎస్.సూర్యకుమారి, పారిశ్రామికవేత్తలు,ఇంజనీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.


స్టాల్స్‌ను తిలకిస్తున్న మంత్రి, కలెక్టర్

దంపతుల దారుణ హత్య

హంతకుడు అల్లుడే

- కత్తితో నరికేసిన వైనం
- తప్పించుకున్న కుమార్తె
- తూర్పుగోదావరి జిల్లా ఘంటావారిగూడెంలో ఘటన


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్


హత్యకు గురైన ఏకుల బాబూరావు, శారద (ఫైల్‌ఫొటో)


రోదిస్తున్న కుమార్తె నాగేశ్వరి


హత్య చేసిన కోటేశ్వరరావు (ఫైల్‌ఫొటో)

నల్లజర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెంలో బుధవారం అత్తమామలను అత్యంత కర్కశంగా అల్లుడు కత్తితో నరికి చంపిన వైనమిది. ఘంటావారిగూడెం గ్రామానికి చెందిన ఏకుల బాబూరావు(55), శారద(50) దంపతులకు నాగేశ్వరి, అప్పారావు సంతానం. నాగేశ్వరికి ఏలూరు జిల్లా దెందులూరు మండలం గంగన్నగూడెం గ్రామానికి చెందిన మారిది కోటేశ్వరరావుతో 15 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి లోకేష్, గిరీష్ ఇద్దరు కుమారులు. నాగేశ్వరికి భర్తతో ఏడాది కిందట విభేదాలు రావడంతో అత్తింటి నుంచి పుట్టింటికి ఇద్దరు కుమారులతో వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. గత నెల భర్త కోటేశ్వరరావు వచ్చి అందరినీ చంపేస్తానని బెదిరించడంతో ఇరుగుపొరుగు వారిని పిలవడంతో అక్కడ నుంచి వెళ్లిపోయాడు. బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు బైక్‌పై వచ్చి తన వెంట తెచ్చుకున్న కత్తితో బయట ఉన్న అత్త శారదను అత్యంత పాశవికంగా పీక కోశాడు. తన కళ్ల ఎదుటే ఈ దారుణం చూసిన భర్త బాబూరావు తప్పించుకునేందుకు లోపలికి వెళుతుండగా ఇంటి ఆవరణలో కత్తితో ఆయన పీక కోశాడు. ఇద్దరు రక్తపు మడుగులో కొట్టుకుని అక్కడికక్కడే మృతి చెందారు. భార్యను చంపేందుకు ప్రయత్నించగా తలుపులు వేసుకుని కేకలు వేయడంతో కోటేశ్వరరావు అక్కడ నుంచి పారి పోయాడు. సంఘటన జరిగిన వెంటనే కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్, సీఐ బాలశౌరి, దేవరపల్లి సీఐ నాయక్ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీ లించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ వృద్ధ దంపతులు ఘంటావారిగూడెం సెంటర్‌లో హోటల్ నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఈ దారుణ ఘటనతో గ్రామస్తులు భయందోళన చెందారు. హత్య చేసిన నిందితుడు కోటేశ్వరరావును 24గంటలలోపు పట్టుకుని కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని డీఎస్పీ దేవకుమార్ తెలిపారు.

పిఠాపురం ఆడపడుచులకు పవన్ కానుక

రేపు పాదగయలో పదివేల చీరలు, పసుపు, కుంకుమ అందజేత


ప్యాంకింగ్ చేసిన చీరలు, పసుపు, కుంకుమ

పిఠాపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గ ఆడపడుచులకు డిప్యూటీ సీఎం, స్థానిక ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ శ్రావణ మాస కానుక పంపారు. పిఠాపురం పాదగయ క్షేత్రంలో శుక్రవారం జరిగే సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొనే మహిళలకు అందించేందుకు పదివేల చీరలు, పసుపు, కుంకుమ సమకూర్చారు. చీరలు, పసుపు, కుంకుమ బుధవారం పిఠాపురం చేరుకోగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వీరమహిళలు ప్యాకింగ్ చేసి పంపిణీకి సిద్ధంగా ఉంచారు. క్షేత్రంలో శుక్రవారం ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకూ 5 బ్యాచ్‌లుగా వ్రతాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. ప్రతి బ్యాచ్ లో వేయి మంది నుంచి 1500మంది వరకూ వ్రతాల్లో పాల్గొనే అవకాశం ఉంటుంది. వ్రతాల్లో పాల్గొన్న వారితో పాటు అక్కడకు వచ్చేవారికి చీరలు అందిస్తారు. వ్రతాల టిక్కెట్లు గురువారం నుంచి జారీ చేస్తామని జనసేన వర్గాలు వెల్లడించాయి. వరలక్ష్మి వ్రతాల క్యూలైన్లు, బారికేడ్లను కాకినాడ ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్ పరిశీలించారు.

నేటి నుంచి దిండి-చించినాడ వారధిపై రాకపోకలు బంద్

అమలాపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారిపై దిండి-చించినాడ మధ్య ఉన్న వారధి మరమ్మతుల కారణంగా ఈ నెల 21 నుంచి 3రోజుల పాటు ట్రాఫిక్‌ను పూర్తిగా నిలుపుదల చేస్తున్నట్టు కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ వెల్లడించారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు వంతెన మరమ్మతుల దృష్ట్యా ట్రాఫిక్‌ను పూర్తిగా నిలిపివేయాలని పోలీసుశాఖను ఆదేశించారు. ప్రస్తుతం మరమ్మతులకు సంబంధించిన కీలక అంశాల పరిశీలనలో భాగంగా 3 రోజుల పాటు ట్రాఫిక్‌ను నిషేధించినట్టు తెలిపారు. దిండి-చించినాడ మధ్య ప్రయాణించే వాహనదారులు ఈ విషయాన్ని గ్రహించి ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా రవాణా ఏర్పాటు చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

అన్నవరంలో రేపు ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం పుణ్యక్షేత్రంలో ఈ నెల 22న చివరి శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా భక్తులు ఉదయం 8గంటలకు స్వామివారి నిత్యకల్యాణమండపం వద్దకు చేరుకోవాలని కోరారు. విచ్చేసే భక్తులు కొబ్బరికాయ, అరటిపళ్లు, విడిపూలు తీసుకుని వస్తే మిగిలిన పూజాద్రవ్యాలను, అమ్మవారి రాగిరూపు దేవస్థానం ఆధ్వర్యంలో సమకూర్చడం జరుగుతుందని ప్రకటనలో తెలిపారు.

భూ పరిపాలనా కమిషనర్, గిరిజన సంక్షేమ కార్యదర్శికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు

రంపచోడవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూ పరిపాలనా ముఖ్య కమిషనర్, గిరిజన సంక్షేమ ప్రిన్సిపల్ కార్యదర్శికి జాతీయ ఎస్టీ కమిషన్ నోటీసులు జారీ చేసింది. రంపచోడవరంలో ఆక్రమణల తొలగింపు పేరుతో నివాస గృహాలను కూల్చేసిన వ్యవహారంలో గిరిజనులకు కూడా నష్టం కలిగించారంటూ రెవెన్యూ, ఐటీడీఏ అధికారులపై రంపచోడవరానికి చెందిన వై.సుభాష్ చంద్రబోస్ జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. నివాస గృహాలు, ఇతర నిర్మాణాలను కూల్చివేసే విషయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా ఇక్కడి అధికారులు వ్యవహరించి గిరిజనులకు నష్టం చేకూర్చారన్నారు. ఆయన ఫిర్యాదును విచారణకు స్వీకరించిన కమిషన్ భూ పరిపాలనా ముఖ్య కమిషన్, గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. ఫిర్యాదులోని ఆరోపణల నేపథ్యంలో తీసుకున్న చర్యలపై కమిషన్‌కు 30 రోజుల వ్యవధిలో నివేదిక సమర్పించాలని, లేనిపక్షంలో ఈ ఇద్దరు ఉన్నతాధికారులు వ్యక్తిగతంగా కమిషన్ ముందుకు హాజరుకావాల్సి ఉంటుందని కమిషన్ తన నోటీసులో పేర్కొంది.

సూచించిన ప్రదేశాల్లోనే గణేష్ నిమజ్జనం

మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలి : ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్


సఖినేటిపల్లి పోలీసుస్టేషన్‌లో మాట్లాడుతున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్

అంతర్వేది, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సూచించిన ప్రదేశాల్లోనే గణేష్ విగ్రహాల నిమజ్జనం కార్యక్రమాలు చేపట్టాలని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్పష్టంచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి పోలీసుస్టేషన్‌కు బుధవారం ఆయన విచ్చేశారు. తొలుత పోలీసుస్టేషన్ వద్ద గౌరవ వందనం స్వీకరించగా జిల్లా ఎస్పీ కృష్ణారావు, డీఎస్పీ మురళీమోహన్ పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. లాకప్, స్టేషన్‌ను పరిశీలించి ఆయన మీడియాతో మాట్లాడారు. రానున్న గణేష్ నవరాత్రులను ప్రతీ ఒక్కరు భక్తిశ్రద్ధలతో బాధ్యతాయుతంగా నిర్వహించుకోవాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మండపాల వద్ద భక్తి గీతాలు ఆలపిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అక్రమ విద్యుత్ సరఫరాలు లేకుండా మండపాల వద్ద ప్రమాదాలకు గురి కాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పోలీసు, కలెక్టర్ల ఆదేశాల మేరకు సూచించిన ప్రదేశాల్లో మాత్రమే నిమజ్జన కార్యక్రమాలు ఏర్పాటు చేసుకోవాలని, ఇష్టానుసారంగా ఎక్కడపడితే అక్కడ నిమజ్జన కార్యక్రమాలు చేపట్టకుండా ప్రమాదాలకు చెక్ పెట్టాలన్నారు. అలాగే కోనసీమ జిల్లాలో కూడా అన్ని స్టేషన్లలో ఉద్యోగాల భర్తీకి సన్నద్ధం చేశామన్నారు. ప్రధానంగా గంజాయి సేవించడం, రవాణాపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. బ్యాంకు లావాదేవీలు జరిపేటప్పుడు అనుమానితులకు సమాచారం ఇవ్వకుండా ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విశ్రాంత ఉద్యోగుల ఇళ్ల వద్ద దోపిడీలకు పాల్పడుతున్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. గ్రామాల రక్షణ కోసం పోలీసులకు ప్రజలు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీఐ నరేష్, ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు జీతాల చెల్లింపు

అన్నవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో సుమారు 350 మంది పారిశుధ్య కార్మికుల జీతాలు బుధవారం పూర్తిస్థాయిలో వారి అకౌంట్‌లో జమ అయ్యాయి. గుంటూరుకు చెందిన కనకదుర్గ మ్యాన్‌పవర్ సర్వీసెస్ సంస్థ ద్వారా ఈ చెల్లింపులు జరిగాయి. 2నెలల జీతాలు పెండింగ్‌లో ఉండగా బుధవారం దేవస్థానం కాంట్రాక్ట్ సంస్థకు అందజేసిన కొద్ది నిమిషాల్లోనే సుమారు రూ.70 లక్షలను 350 మంది కార్మికులకు జమ చేసినట్టు సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

ఘంటావారిగూడెంలో అశ్లీల నృత్యాలు, మద్యం పార్టీ

పోలీసుల దాడి
25 మంది పురుషులు, ముగ్గురు యువతుల అరెస్ట్


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్

నల్లజర్ల, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం ఘంటావారిగూడెం శివారు గుణ్ణం సురేష్ కొబ్బరితోటలో మంగళవారం రాత్రి 25 మంది పురుషులు, ముగ్గురు యువతులతో కలసి అశ్లీల నృత్యం చేస్తుండగా నల్లజర్ల సీఐ బాలశౌరి తన బృందంతో దాడి చేసి వారిని అరెస్ట్ చేసినట్టు కొవ్వూరు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. బుధవారం నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలను వెల్లడించారు. ఉంగుటూరు మండలం నారాయణపురం గ్రామానికి చెందిన గుణ్ణం సురేష్, వెజ్జు వెంకట దుర్గా సుబ్బారావు, ఆగసిస్త నాగ వెంకట దుర్గాప్రసాద్, కిలపర్తి దుర్గాశ్రీనివాస్ మరో 21మంది, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం ప్రాంతాలకు చెందిన ముగ్గురు యువతులతో కలిపి గుణ్ణం సురేష్ పుట్టినరోజు సందర్భంగా కొబ్బరితోటలో పార్టీ ఏర్పాటు చేశారు. ఆ తోటలో 'యు' ఆకారంలో టేబుల్స్ వేసుకుని పురుషులు మద్యం సేవిస్తుండగా, యువతులు ఆ ఖాళీ ప్రదేశంలో అశ్లీల నృత్యాలు చేస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 4 మద్యం బాటిళ్లు, రూ.10 వేలనగదు, ఆరు కార్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ దేవకుమార్ తెలిపారు. గతేడాది ఆగస్టు 16న కూడా వీరు ఇదేవిధంగా యువతులను తీసుకుని వచ్చి డ్యాన్స్ చేస్తుండగా వారిపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరిలో వెజ్జు వెంకటదుర్గా సుబ్బారావుపై ఉంగుటూరు పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని, వీరిని అరెస్ట్‌చేసి కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

ద్రాక్షారామలో చైన్‌స్నాచింగ్

మహిళ మెడలో పుస్తెలతాడు చోరీ

ద్రాక్షారామ, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామలో చైన్ స్నాచర్ మహిళ మెడలో 6 కాసుల బంగారం పుస్తెలతాడు చోరీ చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటాయపాలెం లో లిటిల్‌రోజ్ పాఠశాలలో తంగిరాల జయసంతోషి విష్ణు ప్రియ హెడ్‌మాస్టర్‌గా పనిచేస్తోంది. బుధవారం సాయంత్రం 4.30 గంటల ప్రాంతంలో విధులు ముగించుకుని స్కూటీపై ఇంటికి వెళుతుండగా ద్రాక్షారామ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం దాటిన తరువాత మోటార్ సైకిల్‌పై వచ్చిన ఒక వ్యక్తి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెలు తాడు లాక్కుని వెళ్లిపోయాడు. విష్ణుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు మార్గదర్శకాలు జారీ

కాకినాడ రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వం ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలను జారీ చేసినట్టు కాకినాడ డీఈవో పి.రమేష్ తెలిపారు. వాటి ప్రకారం ఉపాధ్యాయలు, ప్రధానోపాధ్యాయలు స్పౌజ్, మ్యూచువల్ ప్రాతిపదికపై లీప్ యాప్ ద్వారా ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. 21 నుంచి 24 వరకూ ఆన్‌లైన్‌లో బదిలీ కోసం దరఖాస్తు చేసుకోవడం, వాటి ప్రింటవుట్లను సంబంధిత మండల విద్యాశాఖాధికారికి సమర్పించాలన్నారు. 22 నుంచి 25 వరకూ ఎంఈవో ద్వారా దరఖాస్తు ప్రింటవుట్‌ను స్వీకరించడం, ధృవీకరించడం, 23 నుంచి 26వరకూ జిల్లా విద్యాశాఖాధికారితో ధృవీకరణ, 27న పాఠశాల విద్య డైరెక్టర్‌కు సమర్పణ, 28 నుంచి 29 వరకూ పాఠశాల విద్య డైరెక్టర్ ధృవీకరణ, తుది నిర్ధారణ, ఈనెల 30న ప్రభుత్వానికి సమర్పించడం జరుగుతుందన్నారు.

వాడపల్లి వెంకన్న హుండీల ఆదాయం రూ.1.42 కోట్లు

బంగారం 23 గ్రాములు, వెండి 670 గ్రాములు, 10 దేశాల 46 కరెన్సీ నోట్లు

ఆత్రేయపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా వాడపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. పర్యవేక్షణాధికారులు వి.సత్యనారాయణ, టీవీఎస్ఆర్ ప్రసాద్.డి.సతీష్‌కుమార్ పర్యవేక్షణలో లెక్కింపు నిర్వహించారు. 28 రోజులకు గాను ఆలయ ప్రధాన హుండీల ద్వారా రూ.1,19,58,204, అన్నప్రసాద హుండీల ద్వారా రూ.22,58,603 వెరసి రూ.1,42,16,807 ఆదాయం లభించింది. బంగారం 23 గ్రాములు, వెండి 670 గ్రాములు, 10 దేశాలకు సంబంధించి 46 విదేశీ కరెన్సీ నోట్లు లభించినట్టు ఆలయ ఉప కమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. లెక్కింపులో అర్చకులు, సేవకులు, దేవస్థాన సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమలాపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఈదరపల్లి, బాలయోగిఘాట్ విద్యుత్ ఉప కేంద్రాల్లో మరమ్మతుల కారణంగా శుక్రవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. 11కేవీ అన్ని ఫీడర్స్‌లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మాల సంక్షేమ చైర్మన్‌ను సన్మానించిన టీడీపీ నేత

రాజోలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో మాల సంక్షేమ సహకార సంఘ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్‌ను టీడీపీ సీనియర్ నాయకుడు జగడం సత్యనారాయణ దుశ్శాలువా కప్పి పూలమాలలతో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు షెడ్యూల్డు కులాలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అభివృద్ధి దిశగా ముందుకు వెళుతున్నారని తెలిపారు. ఔట్ సోర్సింగ్‌లో దళితులకు ఎస్సీ కార్పొరేషన్‌లో ఉద్యోగాలు ఇచ్చారని, ఆ ఉద్యోగాలను జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని, వాటిని తిరిగి పునరుద్ధరించేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం డైరెక్టర్లు చెల్లి అశోక్, వి.అప్పారావు, మద్దా మణిలను ఆయన సన్మానించారు.

డీసీసీబీని లాభాల్లో నడిపిస్తా: చైర్మన్

- పాలకవర్గాలు రైతులకు సేవలందించాలి : ఎమ్మెల్యే దేవ
- సహకార సంఘాల నూతన పాలకవర్గాలతో సదస్సు


సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ

మలికిపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): సేవ చేసే వారికే పదవులు కట్టబెట్టామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం ఎల్ఎస్ ల్యాండ్‌మార్కులో టీడీపీ సఖినేటిపల్లి మండల అధ్యక్షుడు ముప్పర్తి నాని అధ్యక్షతన రాజోలు నియోజకవర్గ సహకార సంఘాల నూతన కార్యవర్గాలతో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ ద్వారా నియోజకవర్గంలో 23వేల మంది రైతులను ఆదుకున్నామన్నారు. నియోజకవర్గంలో చాలా సొసైటీలు సుమారు రూ.24కోట్ల నష్టాల్లో ఉన్నాయని, రెండు, మూడు సంఘాలు మాత్రం లాభాల్లో ఉన్నాయన్నారు. రాజోలు నియోజకవర్గంలో 26 సంఘాల ద్వారా రూ.200కోట్ల రుణాలు ఇస్తే రూ.22కోట్లు డిపాజిట్లు ఉన్నాయని, రూ.52కోట్లు ఓవర్ డ్యూస్ అయ్యాయన్నారు. అసలు సంఘాల్లోని సీఈవోలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) మాట్లాడుతూ గత పాలకుల అస్తవ్యస్త విధానాల వల్ల లాభాల బాటలో ఉన్న డీసీసీబీ రూ.300కోట్ల నష్టాల్లోకి కూరుకుపోయిందన్నారు. నూతనంగా బాధ్యత తీసుకున్న తాను నష్టాలు భర్తీ చేయడానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. రూ.7వేల కోట్ల టర్నోవర్‌తో ఉన్న కాకినాడ డీసీసీబీలో రూ.700కోట్లు ఓవర్ డ్యూస్ ఉన్నాయన్నారు. రూ.3వేల కోట్లను రైతులకు అప్పులుగా ఇచ్చామన్నారు. ఎమ్మెల్యే సూచన మేరకు షేర్ క్యాపిటల్ పై వడ్డీ ఇవ్వడానికి ప్రయత్నిస్తామన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే దేవ, తుమ్మల బాబులను సొసైటీల తరఫున ఘనంగా సన్మానించారు. సమావేశంలో డీసీవో రాధాకృష్ణ, ఎంపీపీలు ఎంవీ సత్యవాణి, కడలి శ్రీదుర్గ, జి.పెదకాపు, గుబ్బల శ్రీనివాస్, అడబాల సత్యనారాయణ, ప్రవీణ్‌కుమార్, ఐ.మంజు, దిరిశాల బాలాజీ, పినిశెట్టి బుజ్జి, ముప్పర్తి నాని, ఆదిమూలం వెంకటేశ్వరరావు, చాగంటి స్వామి, మాలే శ్రీనివాసనగేష్, మంగెన భూదేవి, శివజ్యోతి, హెలీన, పలువురు సహకార సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై 'వేదాంత' వైఖరిపై ఆగ్రహం

రవ్వ ప్లాంటు వద్ద గ్రామస్తుల ఆందోళన


ఎస్.యానాం రవ్వ ప్లాంటు వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు, నిరుద్యోగ యువత

ఉప్పలగుప్తం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎస్.యానాం రవ్వ సారధి వేదాంత కంపెనీ గ్రామాభివృద్ధిని పట్టించుకోవడం లేదని, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనలో అన్యాయం చేస్తోందని ఆగ్రహించిన గ్రామస్తులు బుధవారం ప్లాంటు వద్ద భారీ ఎత్తున ఆందోళన నిర్వహించారు. వేకువజామున 5గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు ఆందోళన కొనసాగింది. కార్మికులను ప్లాంటులోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. గతంలో అనేకసార్లు ఆందోళనలు చేసినప్పుడు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్లాంటు యాజమాన్యం గ్రామస్తులను నిలువునా మోసం చేసిందంటూ ఆందోళనకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో నిరుద్యోగులను కాదని చిన్నచిన్న పనులకు కూడా ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను దిగుమతి చేసుకుంటున్నారని ఆరోపిస్తూ ఆందోళనకారులు ప్లాంటు యాజమాన్యంపై విరుచుకుపడ్డారు. గతంలో ఇచ్చిన హామీలను తక్షణం అమలు చెయ్యాలంటూ నినాదాలు చేశారు. ఆందోళన తీవ్రస్థాయికి చేరడంతో ప్లాంటు ప్రతినిధులు స్పందించారు. ప్లాంట్ పాలనాధికారి సోమన్‌దేవ్ ఆందోళనకారులతో మాట్లాడారు. అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఆర్డీవో మాధవిలతో ఆయన ఫోన్‌లో మాట్లాడారు. అనంతరం ఆయన ఆందోళనకారులతో చర్చించారు. ఈనెల28న వేదాంత ఉన్నత స్థాయి అధికారులు స్థానిక ఎమ్మెల్యే ఆనందరావు, ప్రభుత్వ అధికారుల సమక్షంలో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తారని హామీ ఇచ్చారు. దీనితో గ్రామస్తులు ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు ప్రకటించారు. ఎస్ఐ చలమల రాజేష్ ఆధ్వర్యంలో పోలీసులు భద్రతా చర్యలు తీసుకున్నారు. అయితాబత్తుల రాజశేఖర్, రేవు తిరుపతిరావు, దంగేటి చిట్టిబాబు, ఉలిశెట్టి దొరబాబు, పలచోళ్ళ పద్మనాభం, లంకే భీమరాజు, కాండ్రేగుల ఏడుకొండలు, ఉండ్రు శామ్యూల్, రేవు రాజేష్, ఉడుము కిశోర్ పాల్గొన్నారు.

పెరుగుతోన్న గోదావరి.. లంకవాసుల వణుకు

-కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతి


ముమ్మిడివరం: అన్నంపల్లి పాత అక్విడెక్టు వద్ద గోదావరి ఉధృతి

పి.గన్నవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద రెండు రోజులుగా తగ్గుతూ... పెరుగుతూ స్థానిక లంకగ్రామాల ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గోదావరి ఎగువ నుంచి భారీగా వరద నీరు దిగువకు రావడంతో ధవళేశ్వరం నుంచి 8లక్షల క్యూసెక్కులవరద నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. దీంతో జిల్లాలోని గౌతమి, వృద్ధగౌతమి, వైనతేయ, వశిష్ట నదీపాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పి.గన్నవరం మండలం చాకలిపాలెం వద్ద కనకాయలంక కాజ్‌వే పైనుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహించడంతో లంక గ్రామానికి రాకపోకలు నిలిపివేశారు. ప్రస్తుతం ఆప్రాంత వాసులు నాటుపడవలపైనే రాకపోకలు సాగిస్తున్నారు. అయితే పడవలపై లైఫ్‌జాకెట్లు లేకుండా ప్రయాణం చేయడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. వరద ఉధృతంగా ప్రవహించడంతో ఆప్రాంత అధికారులు దొడ్డిపట్ల రేవును తాత్కాలికంగా నిలిపివేశారు. అలాగే గంటిపెదపూడి, ఉడిమూడి ప్రాంతాలకు చెందిన నాలుగు లంకగ్రామాలతో పాటు పశ్చిమగోదావరి జిల్లా అనగార్లంక, పెదమల్లంక, ఆయోధ్య లంక గ్రామాల ప్రజలు నదీపాయలపై పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి ఉధృతి పెరగడంతో లంకగ్రామాల అధికారులను అప్రమత్తం చేసినట్టు తహశీల్దార్ పి.శ్రీపల్లవి తెలిపారు.

లంక గ్రామాల్లోకి వరద నీరు

ముమ్మిడివరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి ఎగువన వరద ఉధృతంగా ప్రవహించడంతో దిగువన ఉన్న లంక గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాలకు క్రమేపీ వరద నీరు ప్రవహిస్తుంది. మండలంలోని గురజాపులంక, లంకాఫ్ ఠాణేలంక, కూనాలంక, లంకాఫ్‌గేదెల్లంక, చింతపల్లిలంక తదితర లంక గ్రామాల్లోని లోతట్టు భూముల్లోకి కొంతమేర వరద నీరు ప్రవేశించింది. లంక గ్రామాల్లోని రైతులు నాటు పడవల్లో ప్రయాణాలు సాగించరాదని హెచ్చరికలు జారీ చేశారు. లంకాఫ్ ఠాణేలంక, గురజాపులంక వద్ద మెకనైజ్డ్ బోట్లను ఏర్పాటుచేశారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి ఎస్.మధుసూదన్, మండల ప్రత్యేకాధికారి బి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్ లంక గ్రామాల్లో పర్యటించి అధికారులకు సూచనలు ఇచ్చారు. వీఆర్వోలు స్థానికంగా ఉండి పరిస్థితిని సమీక్షించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తంచేయాలని, లంకవాసులు పడవల్లో రాకపోకలు సాగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు.

గోదావరికి పోటెత్తిన వరద

అయినవిల్లి, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గోదావరి నది పోటెత్తి ప్రవహిస్తుంది. గౌతమీ, వృద్ధగౌతమీ పాయలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముక్తేశ్వరంలో తొగరపాయపై పాతవంతెన నీట మునిగింది. వరద పోటెత్తుతుండడంతో నదీతీర ప్రాంతాలైన లంక గ్రామా వాసులు అప్రమత్తమవుతున్నారు. పల్లపు లంకలు మునిగే అవకాశాలు ఉండడంతో పశువులను, పశు గ్రాసాలను మెరక ప్రాంతాలకు తరలిస్తున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపడుతున్నారు.

ఎస్సీ కార్పొరేషన్ పూర్వ వైభవానికి ప్రణాళికలు

- మాల సంక్షేమ సహకార సంఘం చైర్మన్ విజయ్‌కుమార్


మాట్లాడుతున్న మాలసంక్షేమ సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ విజయ్‌కుమార్

అమలాపురంరూరల్,ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యంగా మారిన ఎస్సీ కార్పొరేషన్‌కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా రూపొందిస్తున్న భవిష్యత్తు ప్రణాళికల్లో భాగస్వాములు కావాలని మాలసంక్షేమ సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈదరపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మాల నాయకులు, మాల సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాల నాయకుల నుంచి సలాహాలు, సూచనలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు చెల్లి అశోక్, మద్దా వాణి పాల్గొన్నారు. అనంతరం మాలమహానాడు నాయకులు మాట్లాడుతూ 2104-18లో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎస్సీ కార్పొరేషన్, ఎన్ఎస్ఎఫ్‌డీసీ ద్వారా రూ.5లక్షల చొప్పున తీసుకున్న రుణాలను రద్దుచేసి వారిని విముక్తి చేయాలని కోరారు. ఎస్సీ కార్పొరేషన్ ఎన్ఎస్ఎఫ్‌టీసీ ద్వారా ఒక్కో మండలానికి బ్యాంకు లింకేజీ లేకుండా 2వేల యూనిట్లు చొప్పున మంజూరు చేయాలని మాలమహానాడు నాయకుల బృందం చైర్మన్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, డాక్టర్ ఎంఏకే భీమారావు, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు, గిడ్ల వెంకటేశ్వరరావు, కుంచే బాబులు, నక్కా సంపత్‌కుమార్, ములపర్తి సత్యనారాయణ, జగడం సత్యనారాయణ, నూకపెయ్యి చిన్నా, నాగారపు నాగరాజు, మట్టా సత్తిబాబు, మెండి డేవిడ్ అంబేడ్కర్, దేవరపల్లి వీరేష్‌కుమార్, గంటి చిరంజీవి, నక్కా కృష్ణ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.340కోట్లు

అమలాపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర-2047 నాటికి ప్రతీ కుటుంబంలో ఒక వ్యాపారవేత్త, ఒక పారిశ్రామికవేత్త ఉండాలని సంకల్పానికి అనుగుణంగా మాల యువతను ఆ దిశగా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టామని మాల సంక్షేమ సహకార సంఘం రాష్ట్ర చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్ పేర్కొన్నారు. వైసీపీ హయాంలో ఎస్సీ కార్పొరేషన్‌ను పూర్తిగా నిర్వీర్యం చేయగా కూటమి ప్రభుత్వం దళితుల డిమాండుకు అనుగుణంగా ఎస్సీ కార్పొరేషన్ ద్వారా తొలి విడతలోనే రూ.340కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. అమలాపురం కాటన్ అతిథిగృహంలో బుధవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. అర్హులకు రాయితీతో కూడిన రుణాలు మంజూరు చేయనున్నట్టు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 330మందికి టైలరింగ్‌లో శిక్షణఇవ్వడంతోపాటు 17ట్రేడ్‌లలో 2వేలమందికి రూ.3కోట్లతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. ఎస్సీలు చిరు వ్యాపారల నుంచి పెద్ద వ్యాపార వేత్తలుగా ఎదిగేందుకు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్లు చెల్లి అశోక్‌కుమార్, మద్దా మణి, కొల్లాబత్తుల అప్పారావు, ఎగ్జిక్యూటివ్‌డైరెక్టర్ సత్యవతిపాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

ముమ్మిడివరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి భారీ వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగమంతా అప్రమత్తంగా ఉండి ఎటువంటి ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. బుధవారం మండలంలోని అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద ప్రవాహ ఉధృతిని ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. వరద ఉధృతి దృష్ట్యా అధికారులు స్థానికంగా ఉండి ముందస్తు చర్యలు చేపడుతూ మెళకువలు పాటించాలన్నారు. ఏటిగట్లు, అక్విడెక్టుల పటిష్టతపై ప్రత్యేక దృష్టి సారించాలని హెడ్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. అక్విడెక్టు పటిష్టతపై చేపడుతున్న రక్షణ చర్యలను ఆరా తీసి ఏమైనా సమస్యలు ఉన్నాయా అని సంబంధిత ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. తొలుత అన్నంపల్లిలోని ఫ్లడ్ స్టోరేజ్ గోదామును పరిశీలించారు. సర్వేబాదులు, ఇసుక బస్తాలు, ఇతర మెటీరియల్ నిల్వలను పరిశీలించారు. ఇసుక బస్తాలను త్వరితగతిన సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద ఉధృతి పెరిగితే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకుడు ఎస్.మధుసూదన్, ఇరిగేషన్ ఈఈ, వెంకటేశ్వరరావు, డీఈ మల్లికార్జునరావు, హెడ్‌వర్క్స్ డీఈ సుబ్బారావు ఏఈ ఈశ్వర్‌మన్యం, ముమ్మిడివరం తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో తాడి శ్రీ వెంకటాచార్య, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు ఉన్నారు.

అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై దృష్టి సారించాలి

అమలాపురం టౌన్,ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని అనధికార లేఅవుట్ల క్రమబద్ధీకరణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ సూచించారు. అనధికార లేఅవుట్లలో కొనుగోలుచేసిన ప్లాట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం కల్పించిన అవకాశంపై అవగాహన కల్పించాలని వివరించారు.స్థానికకార్యాలయంలో సచివాలయసిబ్బంది, వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో బుధవారం సమీక్ష నిర్వహించారు. నీటి పన్నుల వసూలు, పీ-4కార్యక్రమం, రోడ్లపై పశువుల సంచార నియంత్రణ అంశాలపై సమీక్షించారు. డీఈ కేవీవీ సత్యనారాయణ, టీపీవో బి.రాణిసంయుక్త, ఏఈలు వి.కృష్ణ, డీఎస్‌భాస్కర్, కె.వెంకటేష్, మేనేజర్ డి.ప్రభాకరరావుపాల్గొన్నారు.

ముంపు నుంచి వరి పంటను కాపాడాలి

కాట్రేనికోన మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీపీ కోలాటి సత్యవతి

కాట్రేనికోన, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గచ్చకాయలపొర వంతెన వద్ద ఇసుక మేటలు తొలగించి ముంపు బారిన పడుతున్న 4వేలఎకరాల వరి పంటను కాపాడాలని సభ్యులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం ఎంపీపీ కోలాటి సత్యవతి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ముంపు సమస్యపై సభ్యులు గొంతెత్తారు. మండల ఉపాధ్యక్షుడు సానబోయిన నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏటా వర్షాల ముంపునీటితో పాటు సముద్రం పోటుతో వేలాది ఎకరాల్లో వరి, కొబ్బరి పంటను కోల్పోతున్నామన్నారు. స్థానికులు ఇక్కడ బతికే దిక్కులేక ప్రజలు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవులపేట నుంచి గచ్చకాయలపొర వరకు శిధిలమైన ఏటిగట్టును పునర్నిర్మించాలని, ఒంటితాడి వరకు ఉన్న కాల్వను తవ్వి ఇసుక మేటలను తొలగించాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ నేల కిశోర్ మాట్లాడుతూ కూనవరం డ్రెయిన్‌లో వలకట్ల వల్ల గట్టుకు రంధ్రాలు పడి మురుగునీరు, ఉప్పునీరు పంట పొలాల్లోకి చేరుతోందన్నారు. దీని నివారణకు అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీడీవో వెంకటాచలం మాట్లాడుతూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కాట్రేనికోన గేట్ సెంటర్‌లోని ఆర్టీసీ బస్ షెల్టర్ ప్రయాణికులకు కాకుండావ్యాపారులకే ఉపయోగపడుతోందన్నారు. వ్యాపారులను తొలగించడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ ఆరోపించారు. ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టారని, పల్లంకుర్రు రూట్‌లో చాలినన్ని బస్సులు లేక మహిళలు పథకాన్ని వినియోగించుకోలేక పోతున్నారని సభ్యులు అన్నారు. ప్రతివారం జరిగే గ్రీవెన్స్‌కు మండలాధికారులు గైర్హాజరవ్వడం, మండల సమావేశానికి వచ్చిన వారు మధ్యలోనే వెళ్లిపోవడంపై ఎంపీడీవో అసహనం వ్యక్తం చేశారు. ఇది పునరావృతమైతే కలెక్టర్‌కు నివేదిస్తామని హెచ్చరించారు. బొజ్జావారిపేటలో పాఠశాల భవన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీటీసీ కుమార్ కోరారు. తహసీల్దార్ సుబ్బలక్ష్మి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన నివేశన స్థల పట్టాలు రద్దుకావన్నారు. గ్రామాల్లో ప్రధానమంత్రి పథకంలో ఔత్సాహికులు చిన్న, మధ్యతరహా పరిశ్రమలు స్థాపనకు రాయితీ పొందవచ్చని ముమ్మిడివరం పరిశ్రమలశాఖాధికారి వివరించారు. మత్స్యశాఖ అధికారి రమణారావు, ఎంపీటీసీలు మోకా చంద్రనాగరత్నం, గుత్తుల మహాలక్ష్మి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భవన నిర్మాణానికి కృషి

అంబాజీపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట పశువుల సంత మార్కెట్‌లో శిథిలస్థితిలో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని నిర్మించేందుకు చర్యలు తీసుకుంటానని మాల ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పెదపడి విజయకుమార్ అన్నారు. అంబాజీపేటలో షాపింగ్ కాంప్లెక్స్ భవనాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎస్సీ యువకుల ఉపాధి కల్పన కోసం ప్రభుత్వం నిర్మించిన ఎస్సీ షాపింగ్ కాంప్లెక్స్‌ను రూ.79లక్షలతో కొత్తగా నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామని, ఈనిధులు మంజూరు కాగానే భవన నిర్మాణం చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు పెంచాలని, చేతివృత్తిదారులకు రుణాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని విజయకుమార్‌ను మాలమహానాడు మండల అధ్యక్షుడు నాగవరపు నాగరాజు కోరారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్‌పర్సన్ అరిగెల సూరిబాబు, కల్వకొలను తాతాజీ, ముత్తాబత్తుల ప్రశాంత్, చింతపల్లి వెంకటేశ్వరరావు, కోట సత్తిబాబు, మైపాల తాతాజీ, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కామల కాలువలో తేలిన చేపలు, రొయ్యలు

పట్టుకునేందుకు పోటీపడ్డ జాలర్లు



అంబాజీపేట, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ముక్కామల ప్రధాన పంట కాలువలో నీరు కలుషితం కావడంతో చేపలు, రొయ్యలు తేలియాడుతూ కనిపించాయి. దీంతో మధ్యాహ్నం వక్కలంక వంతెన నుంచి ముక్కామల లాకుల వరకు జాలర్లు వలలు, కర్రలతో చేపలు పట్టుకునేందుకు బారులుతీరారు. దొరికిన చేపలను పక్కనే విక్రయాలు నిర్వహించారు. పంటకాలువలో గుర్తుతెలియని వ్యక్తులు కెమికల్ వదలడంతో ఆక్సిజన్ అందక పంటకాలువలో చేపలు, రొయ్యలు పైకి తేలిపోయాయి. దీంతో స్థానికులు, జాలర్లు చేపలు, రొయ్యలు వేటాడుతూ కనిపించారు. ఈచేపలను ఎవరూ తినవద్దని పంచాయతీ అధికారులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ముక్కామల లాకులు, తూము, పెట్రోల్ బంకు వద్ద విక్రస్తున్న చేపలను కొనుగోలు చేయవద్దని సూచించారు.

నేడు విద్యుత్ సమస్యలపై పరిష్కార సదస్సు

అంతర్వేది, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మలికిపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యల పరిష్కారానికి అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు తెలిపారు. గురువారం ఉదయం 10.30నుంచి ఒంటి గంట వరకు జరిగే సదస్సులో సమస్యలపై ఫిర్యాదుల స్వీకరిస్తామన్నారు. విద్యుత్‌బిల్లుల సమస్యలు, కొత్త సర్వీసుల జాప్యం, లోఓల్టేజ్ సమస్యలపై కమిటీకి తెలియచేయవచ్చన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

33కేవీ లైన్, 11కేవీ లైన్లపై చెట్ల కొమ్మల తొలగింపు కోసం సఖినేటిపల్లి, మలికిపురం మండలాల పరిధిలో శుక్రవారం ఉదయం 8నుంచి 2గంటల వరకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు, ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. రెండు మండలాల్లో సబ్‌స్టేషన్‌ల వద్ద మరమ్మతుల కోసం అన్నిగ్రామాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

అమలాపురం టౌన్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని బుధవారం అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక నల్లవంతెన వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహానికి సీనియర్ నాయకులతో కలిసి పూలమాలలువేసి నివాళులర్పించారు. దేశానికి శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని ప్రవేశపెట్టిన ఘనత రాజీవ్‌గాంధీకే దక్కుతుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థలో ఎన్నో మార్పులకు ఆయన శ్రీకారం చుట్టారని వక్తలు కొనియాడారు. ఏఐసీసీ సభ్యుడు యార్లగడ్డ రవీంద్ర, నాయకులు పేరి శర్మ, ఏలేశ్వరపు రాధాకృష్ణ, మెహబూబ్ షకీలా, వస్కా బాబు, సుగ్గు ప్రసాద్, ఈతకోట సోమరాజు, మొల్లేటి వెంకటేశ్వరరావు, అయితాబత్తుల కుమార్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): దేశానికి టెక్నాలజీని పరిచయం చేసిన నాయకుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు అప్పన శ్రీరామకృష్ణ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా మామిడికుదురు బస్టాండు కూడలిలోని రాజీవ్ విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ప్రధానిగాదేశాభివృద్ధికి బాటలు వేసిన నాయకుడని కొనియాడారు. బత్తుల సురేష్‌బాబు, గెడ్డం వెంకటేశ్వరరావు, వాణరాశి దుర్గారావు, ఎం.రత్నం, ఎన్.వెంకటేశ్వరరావు, వాణరాశి దొరబాబు పాల్గొన్నారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని యానాం సమాచారశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఫెర్రీరోడ్డులోని రాజీవ్ విగ్రహానికి పరిపాలనాధికారి మునిస్వామి, మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్, ఎస్పీ చింతా కోదండరామ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సద్భావన దివస్ ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సమాచారశాఖాధికారి కేఎల్‌వీ ప్రసాద్, మట్టపర్తి శ్రీను, రాజు పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. పార్టీకార్యాలయంలో రాజీవ్ చిత్రపటానికి యానాం శాఖ అధ్యక్షుడు ఆర్ధాని దినేష్, కాంటంశెట్టి రామ్మూర్తి నివాళులర్పించారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని ముమ్మిడివరంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక పోలమ్మచెరువు వద్దగల బుద్ధవిహార్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పి.ఉదయభాస్కరవర్మ, వడ్డి నాగేశ్వరరావు, గోడి భాస్కరరావు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): రాజీవ్‌గాంధీ జయంతిని అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ వద్ద ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండల అధ్యక్షుడు దొమ్మేటి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ములపర్తి మోహనరావు, ఎం.పవన్‌రాయుడు, నాని పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయాలి

రాజోలు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అమలాపురంలో ఈనెల25న జరగబోయే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వంశీనాగేంద్రమాధవ్ శోభాయాత్రకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి శోభాయాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా పిలుపునిచ్చారు. ఈసందర్భంగా రాజోలులో గొల్లమందల నిరంజనరావు స్వగృహం వద్ద బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శోభా యాత్ర ఇన్‌చార్జి మాలే శ్రీనివాసనగేష్, జిల్లా ఉపాధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, బీజేపీ జిల్లాకిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు వడ్లమూడి ప్రకాష్, దేవళ్ల మాణిక్యాలరావు, విశ్రాంత ఎంఈవో జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మొల్లేటి సత్యనారాయణమూర్తి, గుబ్బల రాంబాబు, వాణరాశి చక్రం, కొమ్ముల శ్రీను పాల్గొన్నారు.

ఘనంగా నరసింహస్వామి శాంతి కల్యాణం


స్వామివారి ఆలయంలో శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

అంతర్వేది, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బుధవారం బహుళ ద్వాదశిని పురస్కరించుకుని స్వామివారి శాంతి కల్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, పాణిగ్రహణం, మాంగల్యధారణ, భక్తుల గోవిందనామస్మరణల మధ్య అర్చకులు కల్యాణ తంతు నిర్వహించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. తొమ్మిది బుధవారాలు చేసే భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులు నిత్యాన్నదానంలో స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి

మలికిపురం, ఆగస్టు20(ఆంధ్రజ్యోతి): వరదల పట్ల అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ పి.కృష్ణమూర్తి అన్నారు. బుధవారంమలికిపురం తహశీల్దార్ కార్యాలయంలో వరదలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో తహశీల్దార్ టి.శ్రీనివాసరావు, ఎంపీడీవో మల్లికార్జునరావుపాల్గొన్నారు.

6 వరకు గణపతి నవరాత్రి ఉత్సవాలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లిలో ఈనెల27నుంచి సెప్టెంబరు 6వరకు శ్రీసిద్ధివినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ తెలిపింది. బుధవారం వినాయక ఆలయం వద్ద గణపతి నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. తొలుత ఉత్సవాల నిర్వహణకు పందిరి రాట ముహూర్తం జరిగింది. సెప్టెంబరు 5న మద్దింశెట్టి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆఖరిరోజు గణపతి నిమజ్జనం ఉంటుందన్నారు.

ప్రపంచ దోమల నివారణ దినోత్సవం

ముమ్మిడివరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దోమల ద్వారా మలేరియా వ్యాప్తి చెందుతుందని ప్రతీ ఒక్కరూ దోమల నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర పేర్కొన్నారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం సర్ రోనాల్డ్‌రాస్ చిత్రపటాన్ని డీఎంహెచ్‌వో దుర్గారావుదొర ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 1897లో ఆడఎనాఫిలస్ దోమల ద్వారా మలేరియా వ్యాప్తిచెందుతుందని రోనాల్డ్‌రాస్ కనుగొన్నారన్నారు. జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సర్ రోనాల్డ్‌రాస్ కృషి ఫలితంగానే దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అదుపు చేయడానికి చర్యలు చేపట్టగలిగామన్నారు. ఈసందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ముమ్మిడివరంలోని అర్బన్ పీహెచ్‌సీ నుంచి ర్యాలీ నిర్వహించారు. అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రతాప్, యూపీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.సంపూర్ణ, హెల్త్ అసిస్టెంట్ మీరా సాహెబ్ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి

మలికిపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురంలో రైతులకు మంజూరైన డ్రోన్లను బుధవారం ఆయన అందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆధునిక పరిజ్ఞానంతో తక్కువ ఖర్చుతో రైతులు ఎక్కువ లాభాలు పొందాలన్నారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల రైతులకు మంజూరైన రెండు డ్రోన్లను అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, వ్యవసాయాధికారులు రాకేష్, రమ్యప్రియాంక పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు


మామిడికుదురులో వరి చేలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

మామిడికుదురు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు నీట మునిగిన వరి పంట పొలాలను ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు బుధవారం పరిశీలించారు. మామిడికుదురు, నగరం గ్రామాల్లో పర్యటించి పంట పొలాలు పరిశీలించి రైతులకు పలు సూచనలు ఇచ్చారు. అధిక వర్షాలకు పల్లపు ప్రాంతాల్లోని వరి ఊడ్చిన దశ నుంచి పిలకల దశలో నీటి ముంపునకు గురయ్యాయన్నారు. ఎంటీయూ 1318, స్వర్ణ, సంపద స్వర్ణ రకాలు ఐదు రోజులు ముంపును తట్టుకుంటాయన్నారు. పిలకల దశలో నీట మునిగిన వరి పొలం త్వరగా పుంజుకోవడానికి నీటిని తీసివేసి ఎకరాకు 20 కిలోల యూరియా, 10నుంచి 15కిలోల పొటాష్‌ను వేసుకోవాలన్నారు. తెగుళ్ల నివారణకు లీటరు నీటికి ఒక గ్రాము కార్బన్డిజం లేదా 2గ్రాముల కార్బన్డిజం, మాంగోజెబ్‌ను కలిపి పిచికారీ చేసి తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు ఎం.నందకిశోర్, వై.సునీత, వి.రోజా, ఏవో ఎన్వీవీ సత్యనారాయణ, ఏఈవో ఆర్.శివరామకృష్ణ పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షాలకు కడలిలో నీట మునిగిన వరి పొలాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త నందకిశోర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన మార్టేరు శాస్త్రవేత్తలు వై.సునీత, వి.రోజా బుధవారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో కలిసి నీట మునిగిన వరి పొలాలను వారు పరిశీలించారు. నీట మునిగిన వరి పొలాలు త్వరగా పుంజుకోవడానికి వీలైనంతవరకు నీటిని తీసివేయాలని సూచించారు. ఎకరానికి 20కిలోల యూరియా, 10లేదా 15కిలోల పొటాష్‌ను అదనంగా వేసుకోవాలని సూచించారు. రైతులు, వ్యవసాయశాఖాధికారులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం

అమలాపురం రూరల్, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): తాండవపల్లి సచివాలయంలో పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా బదిలీ అయిన సచివాలయ ఉద్యోగులను గ్రామ సర్పంచ్ గంగుమళ్ల ఏసుబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు బుధవారం ఘనంగా సన్మానించారు. వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, ఇమ్మిడివరప్పాడు సర్పంచ్ రేలంగి దుర్గారావు, మాజీ సర్పంచ్ పరమట శరత్‌బాబు, కైరం సత్తిబాబు, నంద్యాల దొరబాబు, గుత్తా సత్యనారాయణ, గుమ్మళ్ల సురేష్, కైరం రాము, పరమట శ్రీను, పంచాయతీ కార్యదర్శి సాధనాల విజయదుర్గ పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వాగ్వాదాలతో దద్దరిల్లిన మండల సమావేశం

• అవమానపర్చారన్న కూటమి ఎమ్మెల్యే, స్థానిక ప్రతినిధులు • అనర్హుల రాకపై అభ్యంతరాలు • నియోజకవర్గాన్ని తూర్పులో కలపాలని తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ళ

కపిలేశ్వరపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వాదాలతో దద్దరిల్లింది. ఈ సమావేశంలో రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు పాల్గొన్నారు. మండల పరిషత్ ప్రజాప్రతినిధులకు ఏడాది కాలం మాత్రమే ఉండగా కూటమి నేతలు అధికారులను అడ్డం పెట్టుకుని వర్క్ ఆర్డర్లు ఇవ్వకుండా అభివృద్ధి అడ్డుకుంటున్నారంటూ వైసీపీ ఎంపీపీ సత్యవేణి, జడ్పీటీసీ పుట్టపూడి ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ పాలనలో తనను వేదికపై అవమానించారని, క్షేత్రస్థాయిలో కూటమి ఎంపీటీసీలు, సర్పంచ్‌లకు నిధులు కేటాయించకుండా వేధించారన్నారు. తనకు జరిగిన అన్యాయాన్ని సరిచేసేందుకు వర్క్ ఆర్డర్లను ఆపు చేయించానన్నారు. ఎంపీపీ సత్యవేణి, జడ్పీటీసీ అబ్బు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎమ్మెల్యేను అవమానించలేదని అలా చెప్పడంలో వాస్తవం లేదన్నారు. కూటమి ఎంపీటీసీ కుంచె ప్రసన్నకుమార్, సర్పంచ్ ఆచంట సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ పుత్సల శ్రీనివాస్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో కూటమి ప్రజాప్రతినిధులకు ఎంత నిధులు కేటాయించారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. జడ్పీటీసీ అబ్బు మాట్లాడుతూ గ్రామాల్లో గంజాయి విచ్చలవిడిగా సరఫరా అవుతోందని, బెల్ట్‌షాపులు ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు ఎవరు పాల్పడినా చర్యలు తీసుకుంటామన్నారు. మండల సమావేశంలోకి ఇతరులు కూర్చోవడంపై అధికార, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల మధ్య వాగ్వాదం జరిగింది. మండపేట నియోజకవర్గాన్ని తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేసేందుకు అనుకూలంగా మండల పరిషత్ తరఫున తీర్మానం చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ళ కోరారు. దీంతో ఏకగ్రీవంగా అంగీకరిస్తూ తీర్మా నం చేశారు. కార్యక్రమంలో మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, ఎంపీడీవో జి.రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ జి. శ్రీనివాస్, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం స్థానిక ప్రధాన తపాలా కార్యాలయం వద్ద ఉద్యోగులు ధర్నా జరిపారు. ఎనిమిదో వేతన సంఘాన్ని నియమించాలని, తపాలా ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు వెంటనే తీర్చాలని కోరుతూ నినాదాలు చేశారు.కార్యక్రమంలో ఎన్ఎఫ్‌ఈ రామచంద్రపురం శాఖ అధ్యక్షుడు వి.కృష్ణమోహనరావు, కార్యదర్శి జీవీ రమణమూర్తి, కోశాధికారి కె.రాంబాబు, పెన్షనర్ ఉద్యోగుల సంఘం నాయకులు బి.రామగంగాధరం, టి.పుల్లేశ్వరరావు, వి.జె.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పశుసంవర్ధకశాఖ అధికారికి అవార్డు

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు ఒ.రామకృష్ణ ఇటీవల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయి అవార్డు అందుకున్నారు. విజయవాడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వై.సింహాచలం నుంచి అవార్డు అందుకున్నారు. నియోజకవర్గంలో అత్యధిక మినీ గోకులాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు, పశువుల దాణా తదితర సేవలు అందించినందుకు దీనికి ఎంపికయ్యారు. ఆయన్ను పశువైద్యులు, సిబ్బంది అభినందించారు.

మాధవ్ పర్యటనను విజయవంతం చేయాలి

కపిలేశ్వరపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ 25న అమలాపురానికి వస్తున్న సందర్భంగా ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆపార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం కోరారు. బుధవారం కపిలేశ్వరపురంలో పార్టీ మండల అధ్యక్షులు నామాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మాధవ్ పర్యటనను దిగ్విజయం చేయాలని బీజేపీ నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు ఛాత్రాది జానకి రాంబాబు, కెవీవీ సాయిరామ్, సూరంపూడి సత్యనారాయణ, పెదపాటి వసంత, గుబ్బల గోవిందరాజు, వెంకటేష్, రాము, తదితరులు పాల్గొన్నారు.

దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దోమల వల్ల అనేక రకాల వ్యాధులు వస్తాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు వైద్యులు సూచించారు. ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో దోమల నివారణ ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి. సాయికిశోర్, డాక్టర్ కె. భాగ్యశ్రీ, హెచ్‌ఈవో రాజా అక్కుల, సీహెచ్‌వో ఎంఎస్ఎన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దోమలను తరిమికొడదాం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలను అరికట్టవచ్చునని వైద్యాధికారులు పి.సౌమ్య, హైమశ్రీ, సబ్‌యూనిట్ అధికారి సీహెచ్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆత్రేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో అరుణకుమారి, విజయభాను, మూర్తి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

వద్దిపర్రు సొసైటీ అధ్యక్షుడిగా కిషోర్

ఆత్రేయపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందని సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు పేర్కొన్నారు. బుధవారం వద్దిపర్రు సోమేశ్వర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం సర్పంచ్ జుజ్జవరపు శ్యామల అధ్యక్షతన జరిగింది. సొసైటీ చైర్‌పర్సన్‌గా ముళ్ళపూడి కృష్ణకిషోర్, సభ్యులు కాకాని వెంకటరత్నం, వీరవల్లి ప్రభాకర్‌రావు చేత సహకార శాఖ అధికారులు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. అనంతరం నూతనంగా నియమితులైన కమిటీ రైతుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. నూతన కార్యవర్గాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, క్లస్టర్ ఇన్‌చార్జ్ ముళ్ళపూడి భాస్కరరావు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజు, దొడ్డపనేని త్రినాథ్, తోట రజని, కరుటూరి రవి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న గోదావరి ఉధృతి



ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి వరద ఉధృతి. పక్క చిత్రంలో ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దృశ్యం

ఆలమూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి పెరుగుతుండటంతో మండలంలోని ఆయా లంక భూముల్లోకి వరదనీరు చేరుతోంది. దీంతో బడుగువానిలంక, చెముడులంక, మడికి, చొప్పెల్ల, మూలస్థానం, జొన్నాడ, ఆలమూరు లంక భూముల రైతుల్లో ఆందోళన నెలకొంది. జొన్నాడ వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తున్నది. జొన్నాడ పుష్కర్‌ఘాట్ వరదనీటిలో మునిగిపోయింది. లంక భూముల్లోకి వరదనీరు చేరడంతో వాణిజ్య పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని రైతులంటున్నారు.

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి
స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, సివిల్ సప్లైస్ డీఎం పి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండలంలోని కేదార్లంక, వీధివారిలంక, నారాయణలంక, అద్దంకివారి లంక, పల్లపులంక గ్రామాల్లోని వరద పరిస్థితులను ఆయన పర్యవేక్షించారు. నారాయణలంకలో రేషన్‌షాపులను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో వెంకటేశ్వరరావు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, ఆయా గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి పొంగి ప్రవహిస్తున్నది. కాటన్ బ్యారేజీ వద్ద 10.30 అడుగులకు వరద నీరు చేరడంతో 7 లక్షల క్యూసెక్కుల వరదనీటిని సముద్రంలోకి విడిచిపెట్టారు. వరద ఉధృతిని అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.

ముంపునకు గురవుతున్న లంకపొలాలు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద ప్రవాహంతో గోదావరి నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. మండలంలోని గౌతమి, వశిష్టపాయల వద్ద అంతకంతకూ వరదనీరు పోటెత్తి ప్రవహిస్తున్నది. దీంతో నదీపరివాహక ప్రాంత లంక పొలాలు వరద ముంపులో చిక్కుకుంటున్నాయి.

కట్టుంగ సర్పంచ్ మృతి

ఆత్రేయపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కట్టుంగ సర్పంచ్ కరుటూరి బ్రహ్మాజీరావు (70) రాజమండ్రిలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన మృతికి గ్రామస్తులు, నాయకులు సంతాపం తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆలమూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆలమూరు సబ్‌స్టేషన్ పరిధిలో 21న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆలమూరు ట్రాన్స్‌కో ఏఈ దుర్గాప్రసాద్ తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఆలమూరు, కొత్తూరు, పెదపళ్ల, గుమ్మిలేరు, మోదుకూరు, నర్సిపూడి గ్రామాల లైన్ల మరమ్మతు నిమిత్తం కరెంట్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

రేపు కరెంట్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): కొత్తపేట విద్యుత్ సబ్‌స్టేషన్‌లో శుక్రవారం చెట్టు కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం పలివెల, సేరుపాలెం, చౌదరిపురం, గంటి, గంటిపల్లిపాలెం గ్రామాలకు రేపు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం వరకు విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ కె.రాంబాబు తెలిపారు.

ఆత్రేయపురంలో...

ఆత్రేయపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరవరం ఆత్రేయపురం, అంకంపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో చెట్టు కొమ్మల తొలగింపును పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ రాంబాబు తెలిపారు.

విరాళం

ఆత్రేయపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్మిస్తున్న వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి కొవ్వూరి సుబ్బారెడ్డి, లక్ష్మీదివ్య దంపతులు రూ.1,00,001 విరాళం ఇచ్చారు. దాతకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జూదరుల అరెస్టు

ఆత్రేయపురం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురంలో బుధవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడులు జరిపారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని రూ.6,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎస్.రాము తెలిపారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి
ఎనిమిది మంది అరెస్టు

రావులపాలెం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడిచేసి ఎనిమిది మందిని అరెస్టు చేశారు. కొమరాజులంక శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్నట్టు సమాచారం రావడంతో ఎస్ఐ కేవీ రమణారెడ్డి సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 13,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

కె.గంగవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని యర్రపోతవరం డీసీ అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యం, టీడీపీ రైతు నాయకుడు బి.శివప్రసాద్ అన్నారు. బుధవారం శివల గ్రామంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఖరీఫ్ 2025 శిక్షణ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ మండల అధికారి ఏ.సద్గురుమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. దీనికి వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. అనంతరం వనరుల కేంద్రం జిల్లా సహాయ వ్యవసాయ సంచాలకులు రాజశేఖర్, ఏడీఏ బి. నాగకుమార్ పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో వీఏఏ దేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది బాలాజీ, సత్యవేణి, నాగలక్ష్మి, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

తొలిఅడుగు స్ఫూర్తితో ముందుకు వెళదాం

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): సుపరిపాలనలో తొలి అడుగు విజయవంతం అయిందని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నికృష్ణ అన్నారు. ఇదే స్ఫూర్తితో ముందుకు వెళదామని ఆయన అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు కాకినాడ రామారావు అధ్యక్షతన బుధవారం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా గన్నికృష్ణ మాట్లాడుతూ అభివృద్ధిని చూసి ఓర్వలేని వైసీపీ నాయకులు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని, వైసీపీ ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. సమావేశంలో మండలాల పార్టీ అధ్యక్షులు, కార్యదర్శులు, క్లస్టర్, బూత్ ఇన్‌చార్జులుపాల్గొన్నారు.

విజిలెన్స్ అండ్ మోనటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడిగా చిన్న అప్పారావు

రాయవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడిగా మాచవరం గ్రామానికి చెందిన కె.చిన్న అప్పారావు నియమితులైనట్లు తెలిపారు. బుధవారం మాచవరంలో ఆయన మాట్లాడుతూ కమిటీలో సభ్యుడిగా తనను ఎంపిక చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుకు చిన్న అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు. ఎంపికైన అప్పారావును పలువురు గ్రామస్తులు, కూటమి నేతలు సత్కరించారు.

రాజీవ్‌గాంధీ సేవలు భేష్

మండపేట, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): దివంగత రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు గర్వకారణమని కాంగ్రెస్ పార్టీ కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షుడు కామన ప్రభాకరరావు అన్నారు. రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి స్థానిక నేతలతో కలిసి నివాళులర్పించారు.

పాల ఉత్పత్తి పెంపుపై రైతులు దృష్టిపెట్టాలి

ఆలమూరు, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): పశుపోషణ లాభసాటిగా ఉండేలా రైతులు దృష్టి సారించాలని పశుసంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ కె.వెంకట్రావు రైతులకు సూచించారు. పెనికేరు, జొన్నాడ గ్రామాల్లో మినీ గోకులాలను బుధవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పెనికేరు, జొన్నాడ పశువైద్యాధికారులు బి.భానుప్రసాద్, డి.వినోద్‌కుమార్ రైతులు పాల్గొన్నారు.

రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలి

రాయవరం, ఆగస్టు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టాలని ఆలమూరు సబ్ డివిజన్ ఏడీఏ కేవీఎస్ చౌదరి పిలుపునిచ్చారు. బుధవారం వి.సావరం, మాచవరం గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి కేవీఎస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడారు. కార్యక్రమంలో మాచవరం, వి.సావరం సహకార సంఘాల అధ్యక్షులు మేడపాటి రవీంద్రారెడ్డి, పిల్లి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తల మండలి కృషి చేయాలి
ఎమ్మెల్యే వేగుళ్ల

కపిలేశ్వరపురం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఆలయాల అభివృద్ధికి ధర్మకర్తల మండలి కృషి చేయాలని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. బుధవారం కపిలేశ్వరపురంలో నిర్వహించిన అగస్తేశ్వర, పాప వినాశేశ్వరస్వామి, జనార్దనస్వామి దేవస్థానం ఆలయాల ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం అగస్తేశ్వర, పాపవినాశేశ్వర స్వామి ఆలయ చైర్మన్‌గా పితాని రామచంద్రరావు, మరో 9 మంది సభ్యులతో, జనార్దన స్వామి ఆలయ చైర్మన్‌గా కామిని అచ్యుతరామారావు, మరో 9 మంది సభ్యులతో మండపేట ఆలయ ఈవో కామేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన చైర్మన్లను, సభ్యులను ఎమ్మెల్యే సన్మానించగా, ఆయన్ను గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు.



ఈవో సుబ్బారావుకు విరాళం అందజేస్తున్న దాత

సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంలో నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి బుధవారం ఒకదాత రూ.1,16,116 విరాళంగా ఇచ్చారు. కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన నెక్కింటి గోపాలకృష్ణ మూర్తి ఈ విరాళాన్ని ఈవో వి.సుబ్బారావుకు అందజేయగా దాతకు స్వామివారి ప్రసాదంతో పాటు, ప్రత్యేక దర్శనం కల్పించారు.